J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 32 9.1.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# సమస్యల వలయంలో గూగుల్ డేటా సెంటర్

## విశాఖ ఏఐ హబ్‌కు బాలారిష్టాలు ఏర్పాటుపై గూగుల్ అంతర్మథనం

ఎన్నో ప్రకటనలు, ఎన్నెన్నో వార్తలు, ఒకరు మేం తెచ్చామంటే, మరొకరు కాదుకాదు ఇది మా ఘనతే అన్నారు. క్రెడిట్ చోరీ చేశారంటూ పరస్పరం విమర్శలకు దిగారు. ఏవరేమన్నా గూగుల్ డేటా సెంటర్‌తో విశాఖ రూపురేఖలు మారతాయని, ఏపీ అభివృద్ధి జోరందుకుంటుందని, మన ఉక్కు నగరం ప్రపంచానికే ఏఐ హబ్‌గా మారుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రజలు కలలుగన్నారు. స్వరాష్ట్రంలోనే ఉపాధి అవకాశాలు పెరిగి తమ జీవితాల్లో కొత్త వెలుగులు వస్తాయని తెలుగు యువత సంతోషించింది. అయితే ఈ ఆశలు, ఆకాంక్షలు నెరవేరేందుకు మరి కొంతకాలం ఎదురు చూడక తప్పని పరిస్థితి నెలకొందనే సమాచారం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశమైంది. అసలు గూగుల్ డేటాసెంటర్ ఏర్పాటులో జాప్యానికి కారణమేమిటి..? పరిష్కారం కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతోంది..? అనే అంశాలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

- అదానీ సంస్థల విశ్వసనీయతపై అమెరికా ప్రభుత్వ సందేహాలు
- భారీ పెట్టుబడుల విషయంలో జాగ్రత్తగా ఉండాలంటూ సూచన
- అనుమానాల నివృత్తికే లోకేష్ యూఎస్ పర్యటన..!




'గూగుల్ డేటా సెంటర్' గత ఏడాది దేశంలో అత్యధికంగా చర్చనీయాంశమైన వార్త ఇది. 1.33 లక్షల కోట్ల అతిభారీ పెట్టుబడితో అందరి దృష్టిని ఆకర్షించిన అంశం కూడా. ఈ ఘనతంతా మాదేనంటూ అధికార విపక్షాలు డప్పు కొట్టుకున్న విషయం కూడా. అయితే, ఆరంభ శూరత్వం అన్నట్లుగా విపరీతమైన స్పెక్యులేషన్స్‌తో తెరమీదకు వచ్చిన ఈ డేటా సెంటర్, ఏర్పాటు విషయంలో మాత్రం ప్రస్తుతం తీవ్ర తర్జనభర్జనలు, చర్చోపచర్చలకు కారణమవుతోంది. ఎందుకంటే అన్ని లాంఛనాలు పూర్తి చేసుకుని ఇక పట్టా లెక్కడమే తరువాయి అనుకున్న సమయంలో అమెరికా ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని అనుమానాలు కొత్త సమస్యకు దారి తీశాయి. అదానీ సంస్థల

10లో



## రామకృష్ణ మిషన్‌లో 'కల్పతరు' దినోత్సవం



నెల్లూరులోని రామకృష్ణ మిషన్‌లో ఇటీవల ప్రముఖ స్వామీజీ శ్రీ రామ కృష్ణ పరమహంసను స్మరించుకుంటూ 'కల్పతరు' దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి హృదానందజీ మహరాజ్ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం దీనదయాళ్ నగర్ వాసులకు అన్నదానం నిర్వహించారు. రామకృష్ణ మిషన్ నిర్వాహకులు టి.లక్ష్మీనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

# వృధా నీటిపై.. వివాదాలు అవసరమా?

వృధాగా సముద్రంలో కలిసిపోయే జలాల విషయంలో వివాదాలు అవసరమా?.. అంటూ మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రం విడిపోయినా ఆంధ్ర–తెలంగాణ ప్రజలంతా అన్నదమ్ముల్లా కొనసాగుతున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో వృధానీటిపై లేనిపోని వివాదాలు ఎందుకని ఆయన అన్నారు. ఏటా దాదాపు 2 నుంచి 3వేల టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలోకి వెళ్ళిపోతున్నాయని, 2వందల టీఎంసీల సామర్థ్యంతో బనకచర్ల ప్రాజెక్టుకు ప్రతిపాదనలు పెడితే, తెలంగాణలోని బీఆర్‌ఎస్ నేతలు సహించడం లేదని, ఆంధ్రప్రదేశ్ ఒక్క బొట్టు నీటిని వాడుకున్నా సహించబో మంటూ హరీష్‌రావు మాట్లాడడం సముచితం కాదని అన్నారు. మిగులు జలాలతో రాయలసీమను రతనాల సీమని చేస్తామని అప్పట్లో జగన్–కేసీఆర్‌లు ప్రకటనలు ఇచ్చిన విషయం హరీష్‌రావుకు గుర్తుచేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకుల్లాగానే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా.. ఏపీ ప్రజలు నీళ్లు వాడుకోకూడదని అంటారని తాము అనుకోవడం లేదన్నారు. తెలంగాణకు వచ్చే నీటిని మేం మళ్ళించేసుకుంటే అభ్యంతరం చెప్పవచ్చు కానీ, వృధాగా పోయే నీళ్ల విషయంలో వివాదం అవసరమా?.. అని ఆయన అన్నారు. మిగుల జలాల సమస్యను తెలుగు రాష్ట్రాలు సయోధ్యతో పరిష్కరించుకోవాలని, ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడంపై ఏపీ–తెలంగాణ రాష్ట్రాలు ఉమ్మడి పోరాటం చేయాలని ఆయన సూచించారు. 2 వేల నుంచి 3 వేల టీఎంసీల నీళ్ళు ఏటా సముద్రంలో కలిసిపోతుంటే, వాటిలో కొంత నీటిని వాడుకుంటామంటే మన సోదరులకు అభ్యంతరమెందుకన్నారు. మనమందరం తెలుగు ప్రజలం…ఒకరి శ్రేయస్సు మరొకరం కోరుకోవాలి..మనలో మనకు ద్వేషమెందుకు?..అని ఆయన ప్రశ్నించారు. కర్ణాటకలో ఆల్మట్టి డ్యాం ప్రాజెక్టు ఎత్తు పెంచితే రెండు రాష్ట్రాలూ ప్రమాదంలో పడే పరిస్థితి ఉందని కూడా సోమిరెడ్డి హెచ్చరించారు.



సోమిరెడ్డి సూటిప్రశ్న

## రక్షణ రంగ భవిష్యత్తులో...

# ఏఐదే ఆధిపత్యం

### – చరిత్ర గతిని మార్చే అవకాశం –

- ఏఐతో విశ్వవ్యాప్త సమాచారం అరచేతిలోకి
- డేటా విశ్లేషణతో అద్భుతాలు
- కీలక రంగాల్లో మహత్తర మార్పులు
- డిజిటల్, ఆర్థిక, సైనిక విభాగాలలో అందనంత ఎత్తుకు అమెరికా, చైనా

ప్రపంచం అంతులేని వేగంతో పరుగులు పెడుతోంది.. దేశాలన్నీ ఆర్థిక శక్తులుగా.. సైనిక శక్తులుగా మారేందుకు తాపత్రయపడుతున్నాయి. తమ దేశ రక్షణ కోసం విస్తృతస్థాయిలో పరిశోధనలు చేస్తున్నాయి. అయితే ప్రపంచ గతిని, గమనాన్ని మార్చివేయనున్న ఏఐని అందిపుచ్చుకోవడంలో మాత్రం వెనుకబడిపోతున్నాయి. కానీ, అమెరికా తన అసమాన పరిశోధనలతో ఏఐ చిప్‌లను రూపొందిస్తూ తన అగ్రరాజ్య స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటుంటే.. మేమేం తక్కువ కాదంటూ చైనా కూడా వారికి సవాల్ విసురుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాబోవు డిజిటల్ యుద్ధాలను ఎదుర్కొనేందుకు భారత్ సంసిద్ధం కావాల్సి ఉంది. జిత్తుల మారి చైనా మన దాయాది పాకిస్థాన్‌కి చేయందించే అవకాశం ఉండడంతో భారత్ అమెరికాతో కలిసి ముందుకెళ్లి.. తన యువశక్తిని ఏఐ వైపు మళ్లించి టెక్నాలజీ యుద్ధంలో విజయ పతాక ఎగరవేయడానికి.. ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. ఇదే అంశాలపైనా ఆలోచనలు.. తెలియజేస్తున్నాను.

సెల్‌ఫోన్ అరచేతిలో ప్రపంచాన్ని చూపిస్తే.. కంప్యూటర్ సమస్త సమాచారాన్ని మస్తిష్కంలో ఉంచుకుని.. అనుకున్న సమయానికి.. అనుకున్న స్థాయిలో.. ఖచ్చితత్వంతో తిరిగి అందిస్తోంది. తద్వారా మానవజాతి అభివృద్ధికి గొప్పగా తోడ్పడుతోంది. తాజాగా వీటికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) తోడవడంతో మనిషి తనకున్న సమాచారాన్ని విశ్లేషించి ఉపయోగించే బాధ్యతను కూడా యంత్రానికే అప్పజెప్పేస్తున్నాడు. ఇంతకాలం మెషిన్.. మానవుడు తనలో చొప్పించిన డేటాను మాత్రమే తిరిగి అనుకున్న రీతిలో అందించగలదు.. కానీ ప్రస్తుతం ప్రపంచాన్ని మంత్రముగ్ధం చేస్తున్న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) తనకు అందుబాటులో ఉన్న డేటా మొత్తాన్ని తనే విశ్లేషించి.. ఊహాత్మక, వ్యూహాత్మక సూచనలను చేయగలదు. కొత్త పరిష్కార మార్గాలను కూడా చూపగలదు. ఫలితంగా లక్ష కంప్యూటర్లు నిక్షిప్తం చేసి, భద్రపరిచే డేటాను సైతం ఏఐతో క్షణాల్లో క్రమానుగతంగా పరిశీలించవచ్చు. కొత్త వ్యూహం రచించవచ్చు. ఈ విషయాన్ని గ్రహించిన ప్రపంచ దేశాలు ఏఐపై విస్తృత పరిశోధనలు ప్రారంభించాయి. ముఖ్యంగా ప్రపంచ పెద్దన్న అమెరికా అతిభారీ స్థాయిలో ఏఐలో పెట్టుబడులు పెడుతూ ఏఐ రంగాన్ని శాసించాలని ఉవ్విళ్లూరుతోంది. అదే దారిలో చైనా కూడా ప్రయాణిస్తూ యూఎస్‌కు పోటీనిచ్చేందుకు యత్నిస్తోంది. తద్వారా శక్తివంతమైన చిప్‌లు, డేటా సెంటర్లను నిర్మించుకుని ప్రపంచ దేశాలకు విక్రయించి ఆదాయం సంపాదించాలని, అందనంత ఎత్తుకు చేరుకోవాలని ఈ దేశాలు ప్రణాళికలు రచిస్తున్నాయి.

#### ఏఐతోనూ ప్రచ్ఛన్న యుద్ధం..

గతంలో అభివృద్ధి, పరిశోధనలు, ఆయుధాలు, ఆర్థిక అంశాలకు సంబంధించి ప్రపంచం రెండు ధ్రువాలుగా విడిపోయింది. ఒకటి యూఎస్ నేతృత్వంలో ఉంటే.. రెండోది సోవియట్ రష్యా ఆధ్వర్యంలో సాగింది. అయితే ప్రస్తుతం అమెరికా, చైనా ఆ స్థానాలను ఆక్రమించాయి. తాజాగా ఏఐతో వచ్చే మార్పులను ముందే పసిగట్టిన అమెరికా డిజిటల్, ఆర్థిక, సైనిక, విద్య, వైద్య, ఆరోగ్య రంగాల్లో ఏఐ పరిధిని విస్తరిస్తూ మానవ దృక్కోణం ఉంచి వనరులను అత్యుత్తమంగా వినియోగించుకోవాలని తలపోస్తోంది. ఫలితంగా ఆయా రంగాల సామర్థ్యం, వేగం, స్థాయిని అమాంతం పెంచి అందనంత ఎత్తుకు చేరుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అందుకే గత ఏడాది కాలంగా ఆ దేశం ఏఐలో పెట్టుబడులను శిఖరాగ్ర స్థాయికి తీసుకెళ్తోంది. ఉదాహరణకు 'ప్రాజెక్ట్ ఆట్లాంటిస్‌లో' పబ్లిక్–ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ విధానంలో 500 బిలియన్లు వెచ్చిస్తోంది. ఇది ఆరంభం మాత్రమే అంటే దాని వెనకున్న భారీ లక్ష్యాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇంతలా ఎందుకు ఏఐకి అమెరికా ప్రాధాన్యత ఇస్తోందో ఆలోచించండి. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చితే.. యూఎస్ ప్రధాన కంపెనీలు ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూపకల్పనలో అత్యవసరం అన్నంతస్థాయిలో పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. దీనికి కారణం ఆయా కంపెనీల వద్ద భారీగా మూలధనం ఉండడమే అని మీరు భావించవచ్చు. అయితే ఒక్క చైనాకు తప్ప ...ఈ రంగంలో అంతతొందర వేరే ఇతర ఏ దేశం చూపించడం లేదు. దీనికి కారణం ఏఐ తీసుకొచ్చే విప్లవాత్మక మార్పులను అవి ఇంకా గుర్తించకపోవడమే, ఒకవేళ గుర్తించినా... అనుకున్నంత స్థాయిలో అవి పరిశోధనలను విస్తృతం చేయడకపోవడమే. కానీ ఇటీవల మధ్యప్రాచ్య దేశాలు.. యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్(యూఏఈ), సౌదీ అరేబియా ఏఐలో పెట్టుబడులను ప్రారంభించాయి. అమెరికా 37 ట్రిలియన్లకు పైగా రుణభారంతో అవస్థలు పడుతున్నా.. ఐఏ రంగంలో మాత్రం పరిశోధనలు ఆపడం లేదు. దీనికి సమాధానం ఏంటంటే.. భవిష్యత్‌లో డిజిటల్ ఆధిపత్యం కలిగి ఉండడం ఎంత ప్రధానమో ఆ దేశానికి తెలుసు కాబట్టి. ఏదేశమైతే అత్యంత శక్తివంతమై చిప్‌లు, డేటా సెంటర్లు, ఏఐని ఉపయోగించే సామర్థ్యం కలిగిన మానవ వనరుల(ఏఐ ప్రొఫెషనల్స్)ను కలిగి ఉంటుందో ఆ దేశానిదే సంపూర్ణ ఆధిపత్యం అని గుర్తించింది కాబట్టి. నిస్సందేహంగా ఒక్కటి మాత్రం వాస్తవం.. మునుపటి టెక్ విప్లవాల మాదిరిగా ఏఐ రంగం ఒక స్థాయి వరకు పెరిగి తర్వాత ప్రాధాన్యం కోల్పోయే రంగం కాదు. అంతకంతకూ విస్తరించుకుంటూ ప్రపంచాన్ని కమ్మేసే కారుమేఘంలా ప్రభావం చూపగలదన్నది సుస్పష్టం. ఇప్పుడెలా ఆయుధాలు అమ్ముకుని అమెరికా ప్రపంచదేశాలను శాసిస్తోందో.. భవిష్యత్‌లోనూ ఏఐ చిప్‌లను అమ్ముకుని తమ వర్గం దేశాలపై పట్టు పెంచుకోవాలన్నది అమెరికా టార్గెట్. అణ్వాయుధ సామర్థ్యం పెంచుకుని ప్రపంచాన్ని ఇప్పుడెలా తమ గుప్పెట్లో పెట్టుకుందో.. ఏఐ ద్వారా కూడా అలాగే చేసుకోవాలని తాపత్రయపడుతోంది. ఈ టెక్నాలజీ లేని దేశాలు మాత్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోవడం ఖాయం.

#### ముఖ్యంగా రక్షణ రంగంలో..

ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నింటికీ ప్రధాన సమస్య భద్రత. దీన్ని ఏఐ ద్వారా శాసించాలని అమెరికా భావిస్తోంది. అందుకే ఏఐ పరిశోధనలను, పెట్టుబడులను పెంచడం ద్వారా డిజిటల్ పద్ధతిలో సైనిక రంగ నియామకాలు, విస్తృతస్థాయి కమ్యూనికేషన్ పెంచుకుని భద్రతా పరంగా రక్షణ రంగంలో సంస్కరణలు తీసుకొచ్చేందుకు యత్నాలు చేస్తోంది. ఈ సంస్కరణలు, విధానాలను అందిపుచ్చుకోలేని దేశాలు అమెరికా ఆధిపత్యంలో ఉండడమో, దానిని సాయం కోరడమో చేయాల్సి ఉంటుందనడంలో సందేహం లేదు. అమెరికా ఇదే స్థాయిలో ముందుకెళ్తే చైనా, రష్యా దేశాలు కూడా అందుకోలేని ఎత్తుకు చేరిపోగలదు. ఇక భారత్ విపరీతమైన మానవశక్తి వనరులు కలిగి భౌగోళిక పరంగా దక్షిణాసియాలో కీలక స్థానంలో ఉంది. అలాగే అమెరికాతో ఉన్న స్నేహ సంబంధాల కారణంగా కాస్త ఎక్కువ ప్రయోజనం పొందగలని అంచనా వేయవచ్చు. ఏదేమైనా భవిష్యత్‌లో డిజిటల్ యుద్ధాలు తప్పకపోవచ్చు. దేశాలు సొంత చిప్‌లతో పేటెంట్ కలిగి ఏఐ రంగంలో పోటీ పడతాయి. అలాగే అమెరికా నుంచి ఏఐచిప్‌లను కొనుగోలు చేస్తాయి. ఇదంతా ప్రస్తుతం దేశ భద్రత కోసం ఆయుధాలు కొనుగోలు చేసిన తరహాలోనే టెక్నాలజీని కొనుగోలు చేయడంగా భావించవచ్చు. ఈ కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవడం, సేవలందించేందుకు గాను అమెరికా, చైనా, భారత్‌లో ఉద్యోగాల కల్పన భారీ స్థాయిలో పెరిగే అవకాశం ఉంది. అమెరికా పాలకులు, శాసనకర్తలు ఈ విషయాన్ని గుర్తించే యుద్ధ ప్రాతిపదికన ఏఐపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. చైనా కూడా ఇదే దారిలో వడివడిగా ముందుకు సాగుతోంది. కానీ మిగిలిన ప్రపంచ దేశాలు మాత్రం ఏఐ సృష్టించబోయే తుపాను గుర్తించడం లేదు లేదా ఒకవేళ గుర్తించినా అవసరమైన వనరులు లేక అవి నిస్తేజంగా ఉండిపోతున్నాయి. దీనర్థం ఏమిటంటే భారతదేశం ఇప్పటికైనా మేల్కొని యుద్ధప్రాతిపదికన ఏఐ రంగంలో పెట్టుబడులను అధికం చేయాలి. ప్రపంచంలో ఏ దేశానికి లేనంత యువశక్తి మన దేశానికి ఉంది. కాబట్టి ఏఐ టెక్నాలజీని అందిపుచ్చుకుని పెద్దసంఖ్యలో ఏఐ ప్రొఫెషనల్స్‌ను తయారు చేసుకోవాలి. భవిష్యత్ అవసరాల దృష్ట్యా అమెరికాతో స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉండాలి. ఎందుకంటే రాబోవు ఏఐ యుద్ధంలో వారు అందరికంటే ముందుండి ఆధిపత్యం చెలాయించబోతున్నారు కాబట్టి. మన దేశంలో ఏఐ విస్తృతం కావాలంటే టెక్నాలజీతో పాటూ చిప్‌లు తప్పనిసరి కాబట్టి అమెరికాతో స్నేహం తప్ప మరో మార్గం లేదు. ఇక ఇప్పటికే ఏఐలో చాలావరకు పేటెంట్‌లు పొంది దూసుకెళ్తున్న చైనా మనకెప్పుడూ నమ్మదగ్గ మిత్రదేశం కాదు. పైగా మన శత్రుదేశం పాపిష్టి పాకిస్థాన్‌కి వారెప్పుడూ సాయం చేస్తారు. భారతదేశంలోని పాలకులు, మేధావులు, శాసన నిర్మాతలు ఈ విషయాన్ని గ్రహించి ముందుకెళ్లాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇంకో తాజా విషయం ఏంటంటే.. చైనీయులు ఇటీవల ప్రసిద్ధ సంస్థ ఏఎస్ఎంఎల్ తయారుచేసే అడ్వాన్స్‌డ్ చిప్‌లను రివర్స్ ఇంజినీరింగ్ చేశారు. ఇవి ఇప్పటి వరకు వచ్చిన చిప్‌లలో అగ్రగణ్యమైనదిగా భావిస్తున్నారు. సో భారత్.. థింక్ బిగ్ ఇన్ ఏఐ.. థింక్ స్ట్రాంగ్ ఇన్ ఏఐ అనాల్సిన అవసరం కనిపిస్తోందన్నది నా అభిప్రాయం.!



రంజిత్ కొల్లు
యం.యస్. (యుఎస్ఏ)

ఆంగ్లం నుండి తెలుగు అనువాదం : బాలుబాబు



ఇటీవలే నెల్లూరుజిల్లాకి కలెక్టర్‌గా వచ్చిన హిమాన్షు శుక్లా.. ప్రతి పనిలోనూ తనదైన ప్రత్యేకతను చాటుకుంటూనే ఉన్నారు. ఎంతో నిబద్ధతగా పాలన సాగిస్తూ.. జిల్లాను ప్రగతి పథంలో పయనింపజేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి కూడా ఆయన ఇటీవల ప్రశంసలందుకున్న విషయం అందరికీ తెలిసిందే. జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులకు ఆయన బాటలు వేస్తున్నారు కూడా. ముఖ్యంగా ఆయనకు పేద విద్యార్థులంటే ఎంతో అభిమానం. వారు బాగా చదువుకుని మంచి భవిష్యత్తునందుకోవాలన్నదే ఆయన ఆరాటం.

# కలెక్టరంటే.. ఇలా ఉండాలి!

నూతన సంవత్సరారంభం రోజున.. తనకు శుభాకాంక్షలు చెప్తూ పలువురు అందించిన పుస్తకాలను.. విద్యాసామగ్రిని పేద విద్యార్థులకి పంచిపెట్టి, వారి పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు కలెక్టర్ హిమాన్షు శుక్లా. తమకు వచ్చిన గిఫ్ట్‌లను కూడా పేదపిల్లలకు ఇచ్చి వారి ముఖంలో సంతోషం చూసి తానూ ఆనందించారు. అంతేకాదు, పేదపిల్లలు బాగా చదువుకుని సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే ధ్యేయంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేవారికి అవసరమైన సదుపాయాల కల్పనలోనూ కలెక్టర్‌గా ఆయనెంతో శ్రద్ధ వహిస్తున్నారు కూడా. ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహానికి వాషింగ్ మెషిన్‌ను అందజేయడమే కాక, నూతన సంవత్సరం సందర్భంగా సరికొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ, జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లకు విద్యాసామగ్రిని పంపించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయటానికి స్వీట్లు, బొకేలు వంటి వాటికోసం అనవసర ఖర్చు లేకుండా, విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చి..ఓ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. దీంతో, జిల్లాలోని అధికారులు, ప్రముఖులు, ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయటానికి కలెక్టర్‌ని కలిసేందుకు వచ్చినప్పుడు, విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, పరీక్షల ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు మొదలైన వస్తువులను అందజేశారు. వాటినంతా కలెక్టర్ పేద పిల్లలకి పంపిణీ చేశారు. అందులో నిఘంటువులు, నోటుపుస్తకాలు, స్వీట్లు-పండ్లు వగైరాలెన్నో ఉన్నాయి. జనవరి 1న.. నగరంలోని జనహిత-వాత్సల్య అనాథాశ్రమంలో చదువుతున్న 250 మంది నిరుపేద విద్యార్థులకు జిల్లా కలెక్టర్ పెన్నులు, పెన్సిళ్ళు, నోటు పుస్తకాలు.. వ్యాకరణం పుస్తకాలు, విద్యాసామగ్రి, స్వీట్స్, పండ్లు తదితరాలను పంపిణీ చేసి తన ఔదార్యాన్ని చాటుకోవడమే కాక, కావలిలోని ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థులకు కూడా కొంత సామగ్రిని అందజేసి.. ఉన్నతాధికారులంటే ఎలా ఉండాలో తెలియజెప్పారు. ముఖ్యంగా కలెక్టరంటే ఇలా ఉండాలని చెప్పకనే చెప్పారు.



'వాత్సల్య' చిన్నారులతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

# విద్యుత్ చార్జీల తగ్గింపు హర్షదాయకం

## ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడం పట్ల ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హర్షం వ్యక్తం చేశారు. 2014-19 మధ్య కాలానికి సంబంధించి 4,498కోట్ల ట్రూఅప్ చార్జీలను వసూలు చేయాలంటూ, ఏపీఈఆర్‌సి ఇటీవల కూటమి ప్రభుత్వానికి లేఖ రాసిందన్నారు. అయితే ఆ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారని ఎమ్మెల్యే తెలిపారు. ట్రూ డౌన్ అమలు ద్వారా విద్యుత్ చార్జీల్లో యూనిట్‌కు 13పైసలు తగ్గించారన్నారు. గత వైకాపా పాలనలో విద్యుత్ రంగాన్ని ఆదాయ వనరుగా మార్చుకొని 1.29 లక్షల కోట్లు అప్పులు మిగిల్చారని, ఐదేళ్ల అరాచక పాలనలో 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి దాదాపు 32 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. జగన్‌రెడ్డి పాలనలో ఆక్వా రైతులకు యూనిట్‌కు 3.5 రూపాయలు వసూలు చేస్తే, తమ ప్రభుత్వం దాన్ని 1.5 రూపాయలకు తగ్గించిందని చెప్పారు. అలాగే జగన్ పాలనలో 5.19 రూపాయలకు విద్యుత్ కొనుగోలు చేస్తే, తమ కూటమి ప్రభుత్వం 4.70 రూపాయలకి కొనుగోలు చేస్తుందని చెప్పారు.

## లేనే లేదు జంకు..

# దర్జాగా దొంగ పెట్రోలు బంకు!



అనుమతి లేకుండా మద్యం అమ్మే బెల్టు షాపుల గురించి మనం విన్నాం. కానీ, ఎలాంటి అనుమతులు లేకుండా ఏకంగా పెట్రోలు బంకునే నడపడం మొట్టమొదటిసారి వింటున్నాం. ఈ చోద్యం ఎక్కడోకాదు నెల్లూరుజిల్లాలోనే జరిగింది. సర్వేపల్లి నియోజకవర్గం, ముత్తుకూరు మండలంలోని, పిడతాపోలూరు సమీపంలో గల జెన్‌కో రోడ్డులో ఈ నకిలీ పెట్రోలు బంకు భాగోతం బయటపడింది. కడప జిల్లా ప్రొద్దుటూరు నుండి ట్యాంకర్ల ద్వారా డీజల్ తరలించి సదరు ట్యాంకర్‌కే నేరుగా తాత్కాలిక పంపుని బిగించి బాహాటంగా డీజల్ అమ్మేస్తున్నారు. ఎలాంటి జంకు లేకుండా ఈ బంకు ఏర్పాటు చేయడాన్ని ముత్తుకూరు మండలం తెలుగుదేశం నాయకుడు నీలం మల్లికార్జునయాదవ్ అడ్డుకున్నాడు. సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్ వారికి ఫిర్యాదు చేశాడు. పౌరసరఫరాల శాఖ అధికారులు ట్యాంకర్‌ని సీజ్‌చేసి దర్యాప్తు జరుపుతున్నారు. సహజంగా పెట్రోల్ బంకు పెట్టాలంటే చాలా అనుమతులు తీసుకోవాలి. అనేక నిబంధనలు పాటించాలి. అవన్నీ తుంగలో తొక్కిన ఈ పొరుగు జిల్లా ఘనులు నిర్భయంగా, నిర్భీతిగా డీజల్ అమ్మకానికి పాల్పడ్డారు.

కలికాలం ఏం చేద్దాం...!

# 12న.. మరో రాకెట్



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ కొత్త సంవత్సరారంభంలో మరో కొత్త రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి ఈనెల 12న పీఎస్‌ఎల్‌వీ-సీ62 రాకెట్‌ను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా ఈఓఎస్-ఎన్1 (అన్వేష్) అనే భూ పరిశీలన ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనున్నారు. ఇప్పటికే రాకెట్‌లోని అనుసంధాన పనులన్నీ పూర్తిచేశారు. ఈ రాకెట్‌ని ఈనెల12న ఉదయం 10-17 గంటలకు ప్రయోగించాలని భావిస్తున్నారు.

# డీసీసీ అధ్యక్షునిగా.. కిరణ్‌కుమార్‌రెడ్డి



నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)కి కొత్త రథసారథిగా నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ నుంచి ఆమేరకు ఆయనకి ఇటీవల ఉత్తర్వులు వచ్చాయి. ఆయన స్వస్థలం మనుబోలు మండలం అక్కంపేట గ్రామం. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరుజిల్లా కోవూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలందిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తించి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి డీసీసీ అధ్యక్ష పదవిని అప్పగించినందుకు ఏఐసీసీ నేతలకు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేసేందుకు తనవంతు కృషిచేస్తానని చెప్పారు.

## శ్రీ రాజరాజేశ్వరమ్మకి

# 27.82 లక్షల ఆదాయం

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరమ్మ దేవస్థానంలోని హుండీలను ఈ నెల 7న లెక్కించారు. గత ఏడాది అక్టోబర్ 4 నుండి ఇప్పటివరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 27.82 లక్షలు ఆదాయం వచ్చిందని ఆలయవర్గాలు తెలిపాయి.




లాయర్
జనవరి 09, 2026

# మంచుతో..ముంచుకొస్తున్న ప్రమాదాలు!

శీతాకాలం వస్తే చాలు.. చలిచలిగా.. హాయిగా.. ప్రకృతి వాతావరణం మనోహరంగా ఉంటుంది. చల్లని గాలులు మనసుకెంతో ఆహ్లాదం కలిగిస్తాయి. అయితే ఇలాంటి సమయంలో కూడా ప్రమాదాలు పొంచి ఉంటాయని, కనుక అప్రమత్తత అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మంచు కురిసే వేళలో..మనసు ఆనందడోలికలూగుతుందని కవులు పాడుకోవచ్చు కానీ, వాస్తవానికి చలికాలం.. ప్రజలకి కష్టకాలమనే చెప్పవచ్చు. ముఖ్యంగా, రోడ్లపై వాహనాల్లో ప్రయాణించే వారు, తరచూ మంచువల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. ఆ ప్రమాదాల సంఖ్య, అందులో మరణిస్తున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటోందన్నా అతిశయోక్తేమీ కాదు. దట్టమైన పొగమంచు కమ్ముకుని ఉండడంతో, రోడ్లపై ముందు వెళ్లే వాహనాలు కానీ, దారులు కానీ సరిగ్గా కనిపించక తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శీతాకాలంలో వేలాదిమంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారంటే పొగమంచు ఓ మృత్యురాకాసిగా మారి, ప్రజల ప్రాణాలెలా తీస్తోందో ఊహించుకోవచ్చు. ఇటీవలి కాలంలో అలాంటి ప్రమాదాలు మరింతగా పెరుగుతుండడం విచారకరం. కేంద్రప్రభుత్వ లెక్కల ప్రకారం చూసినా..ఏటా శీతాకాలంలో మనదేశంలో సగటున 30 వేల మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారని తెలుస్తోంది. ఇలాంటి ప్రమాదాలను నియంత్రించేందుకు ఆశించిన స్థాయిలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఏటా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదు. విశాలంగా ఉండే జాతీయరహదారుల్లో డ్రైవింగ్ ఈ చలికాలంలో మధురానుభూతిని కలిగిస్తుంది కానీ, పొగమంచులో ప్రయాణించడం ప్రాణాలకే ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అందులోనూ, అటవీ ప్రాంతాల్లో ఉన్న రోడ్లమీద, కొండప్రాంతాలమీద దట్టమైన పొగమంచు ఆవరించి ఉంటుంది. రాత్రి 6 నుంచి ఉదయం 8 గంటల వరకు రోడ్లు మంచుదుప్పటి కప్పుకుని ఉంటాయి. ఆ సమయంలో డ్రైవర్లు మెళకువగా లేకుంటే ప్రమాదాలు కొనితెచ్చుకున్నట్లే. రోడ్లపై ఉన్న లైన్‌మార్కులు కూడా సరిగా కనిపించవు. రోడ్లు బాగున్నాయి కదా అని, వేగం పెంచితే ప్రాణంమీదికి తెచ్చుకున్నట్లే అవుతుందని విజ్ఞులు-అనుభవజ్ఞుల మాట.

అయినా, పట్టించుకోకుండా చిత్తం వచ్చిన రీతిగా అతి వేగంగా వాహనం నడిపితే, సరాసరి మృత్యు గుహలోకే వెళ్లాల్సి ఉంటుంది. వాహనాలకి ఉన్న అద్దాలు మంచుతో మసకబారిపోతాయి. వాహనాలకి ఉన్న లైట్లు కూడా ఎక్కడో మినుకు మినుకుమంటుంటాయి. ఎదుటి వాహనం బాగా దగ్గరికొచ్చేదాకా కనిపించదు. దీంతో కన్నుమూసి తెరిచేలోగా ప్రాణాలు గాల్లో కలసిపోతుంటాయి. పొగమంచు వల్ల ఎక్కడెక్కడ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయో, అలాంటి డేంజర్ జోన్లని గుర్తించి, ఆ ప్రమాదాలు పునరావృతం కాకుండా రోడ్ల పక్కన సూచనల బోర్డులు పెట్టడం, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటుచేయడం, రోడ్ల మలుపుల్లో హెచ్చరికలు బోర్డులు పెట్టి వాహనదారులను అప్రమత్తం చేయడం అత్యంత అవసరం. వీలైనంతవరకు అర్ధరాత్రి వేళల్లో, వేకువఝామున ప్రయాణాలకు దూరంగా ఉంటే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఫాగ్‌లైట్ల కాంతిలో, నెమ్మదిగా వాహనాలు నడపాలే తప్ప, వేగం పెంచితే ముప్పు తప్పదంటున్నారు. మరోవైపు ఈ చలికాలంలో ఇలాంటి ప్రమాదాలతో పాటు, ప్రజలకి అనేకరకాల ఆరోగ్యసమస్యలు వస్తుంటాయి. గిలిగింతలు పెట్టే చలి..యువతకు సంతోషం కలిగించినా, పిల్లలు-వృద్ధులకి మాత్రం దీంతో ఎన్నో ఇబ్బందులున్నాయి. డిసెంబరు నుంచి మార్చి నెలాఖరు దాకా చలికాలం జనాన్ని వణికిస్తూనే ఉంటుంది కనుక, చలికి తట్టుకునేవిధంగా ఎవరికి తగ్గట్టు వారు ముందుజాగ్రత్తలు తీసుకోవడం అవసరం. చలిబారిన పడకుండా స్వెట్టర్లు, మాస్కులు వంటివి ధరించాలి. ఆరోగ్యమే మహాభాగ్యం కనుక, చిన్న అనారోగ్యం కలిగినా, 'అదేముందిలే - తగ్గిపోతుందిలే' అనుకోకుండా, ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలు తీసుకోవాలి. ఇప్పటికే జలుబు-దగ్గు-జ్వరాలు, కీళ్లనొప్పులు, గొంతునొప్పులు, శ్వాసకోశ వ్యాధులు వంటివి విజృంభించడంతో అనేకమంది ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ చలికాలంలోనే ప్రాణాంతకమైన గుండె జబ్బులు కూడా అధికమవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.. గుండె నొప్పి వస్తే.. ఏ మాత్రం తాత్సారం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరం.

తస్మాత్!..జాగ్రత్త!..

# రైట్ దారిలో పోలేకపోతున్న లెఫ్ట్ సోదరులు!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

డోనాల్డ్ ట్రంప్ వెనిజులాపై దాడిచేసి ఆ దేశ అధ్యక్షున్ని బంధిస్తే, తెగ గుండెలు బాదుకుంటున్న నా దేశ సెక్యూలర్ లెఫ్ట్ సోదరులారా నిజం చెప్పండి, ఆ సంక్షోభంతో మనకేం సంబంధం? ఆ అరెస్టు వల్ల మన దేశానికి వచ్చే నష్టం ఏమీ లేదు. అవునవును, అమెరికా సామ్రాజ్యవాదం అనే ఓ థియరీ ఉంది కదా మీ దగ్గర. అలా అయితే మీ మైండ్‌లో ఏదో ఉందబ్బా. ఎలా అంటారా, జస్ట్ వినండి...

టారీఫ్‌ల పేరుతో మన దేశంపై యాభై శాతం సుంకాలు వేసి మన దేశ ఆర్థిక వ్యవస్థని తునాతునకలు చేయాలని ఆ సామ్రాజ్యవాద ట్రంప్ నిర్ణయించినప్పుడు ఏమయ్యాయి మీ నోర్లు, మూగబోయాయా...? లెఫ్ట్ పార్టీ కానీ, దాని అనుబంధ సంస్థలు కానీ ఒక్క మాట మాట్లాడాయా...? అబ్బే మాట్లాడవు, ఎందుకంటే మనదేశాన్ని ఏలుతోంది ఎన్డీయే ప్రభుత్వం, అందులో కమ్యూనిస్ట్లు లేరు కదా..!

దేశం ఏమయినా మీకేం నష్టంలేదు. ట్రంప్ యాభై శాతం టాక్స్ కారణంగా, దేశంలో అశాంతి వస్తేనే కదా మీ మనుగడ ఇంకా గట్టిగా ఉండేది. ఇదే కదా మీ ఆలోచన, ఆకాంక్ష కూడా. లెఫ్ట్ సోదరులారా ఓ క్లారిటీ తెచ్చుకోండి. మీ శత్రువు ట్రంపా లేక బీజేపీనా...? చిత్రంగా ఈ సమయంలో మావో కంటే ధీటుగా.. ట్రంప్‌కి ఎదురొడ్డి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు మాకు వద్దు అని నిల్చిన ఏకైక యోధుడు నరేంద్ర మోడీ. చేతనైతే దేశం కోసం మోడీకి అండగా ఉండండి, లేదంటే మౌనం పాటించండి. అంతే తప్ప మీ రెండు నాల్కల విధానం మానండి. ఒక్క విషయం మాత్రం గుర్తుపెట్టుకోండి.. ట్రంప్ అక్కడెక్కడో వెనిజులాపై దాడి చేస్తే, దానిపై మీరు స్పందిస్తే మీరెప్పటికీ మేధావులు కాలేరు. వెనిజులా వ్యవహారంలో ట్రంప్‌ని ఉగ్రవాదిగా అభివర్ణిస్తున్నారు. అదే ట్రంప్ మన దేశంపై టారిఫ్‌ల పేరుతో దాడి చేసినప్పుడు ముసిముసి నవ్వులతో నిశ్శబ్దం పాటించిన మీరు నా దృష్టిలో ట్రంప్ కంటే పెద్ద ఉగ్రవాదులబ్బా...!

– ఎస్.శ్రీనివాస్‌రెడ్డి,
సీనియర్ జర్నలిస్ట్, హైదరాబాదు.

# నిర్లక్ష్యపు నీడలో నిఘా!

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుపతిలో కొలువైవున్న శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయ గోపురంపైకి ఓ తాగుబోతు ఎక్కాడన్న వార్త ఇటీవల అన్ని ప్రధాన పత్రికలలో వచ్చింది. నిజంగా ఇది సిగ్గు చేటైన విషయం. ఇటు తిరుపతి అటు తిరుమలల్లో రోజూ వేలాదిమంది యాత్రికులు వస్తుంటారు. మన దేశంతో పాటు ఇతర దేశాల నుండి కూడా సందర్శకులు తరచూ లక్షలలో తరలివస్తారు. వచ్చేవాళ్ళలో ఎవరు ఎలాంటివాళ్ళో గుర్తించడం చాలా కష్టం. ఇలాంటి పరిస్థితులలో కనీసం ప్రధాన ఆలయంలోకి ప్రవేశించేవారినైనా జాగ్రత్తగా గమనించుకోవలసిన బాధ్యత భద్రతా సిబ్బందిదే. వళ్ళు తెలియని స్థితిలో వున్న ఒక తాగుబోతు భద్రతావలయాన్ని ఛేదించుకుని ప్రధాన ఆలయగోపురం చివరి వరకూ ఎక్కగలగడం నిఘావ్యవస్థల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. ఇకనైనా భద్రతా విభాగ ఉన్నతాధికారులు మేల్కోవాలి. ఈ సంఘటనకి కారణమైన వారిపై తగిన చర్యలు చేపట్టాలి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరిగితే శిక్షలు ఇంత కఠినంగా ఉంటాయా అన్న భయం వారిలో కలిగేలా వారిని దండించాలి!

– లక్ష్మీ భరద్వాజ్,




# కన్న తండ్రినే కాటికి పంపుతున్న కసాయి కొడుకులు!

నాన్నంటే ఓ నమ్మకం, నాన్నంటే ఓ భరోసా, నాన్నంటే ఓ త్యాగం, నాన్నంటేనే ఓ ధైర్యం. నాన్నే లేకుంటే కుటుంబానికి ఆసరా ఉండదు. బిడ్డలకే కాదు వారికి జన్మనిచ్చిన తల్లికి సైతం చేయూత ఉండదు. తల్లి జన్మనిచ్చినా, పిల్లల భవిష్యత్తు పై భరోసా, బాధ్యతా అంతా నాన్నదే. వారిని సమాజంలోకి చేయిపట్టుకు నడిపించుకుని వెళ్ళేది నాన్నే. మంచి చెడులు తెలియజెప్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దేది నాన్నే. తానెంత కష్టపడినా, ఆ బాధలనేమీ బయటకి కనిపించనీయకుండా బిడ్డలను భుజాల మీద మోసుకుని వారిని ఉన్నతస్థాయికి చేర్చాలని నిరంతరం తపనపడేది నాన్నే. అలా తమ బిడ్డల ఉన్నతి కోసం తమ జీవితాలు త్యాగంచేసే నాన్నలకి మన భారతీయ సమాజంలో కొదవేలేదు.

*'ఓ నాన్నా!..నీ మనసే వెన్న..*
*అమృతము కన్నా.. అది ఎంతో మిన్న'..*

అంటూ యాభై ఏళ్ళ నాడు 'ధర్మదాత' సినిమాలో డాక్టర్ సి.నారాయణరెడ్డి రాసిన పాట 'తండ్రికి-పిల్లలకీ మధ్య ఉండాల్సిన ఆత్మీయతకి, అనుబంధానికీ అర్థాన్ని తెలుపుతుంది. హృదయాన్ని కదిలించే ఆ పాట 'నాన్న' విలువని తెలియజేస్తుంది. అలాంటి ఆత్మీయతలు, అనుబంధాలు ఇప్పుడు ఉన్నాయా...? అంటే అనుమానమే. బిడ్డల అభ్యున్నతి కోసం నిస్వార్థంగా హారతి కర్పూరంలా కరిగిపోతారు నాన్నలు. కానీ వాళ్ళు తమ బిడ్డలదగ్గర నుండి తిరిగి ఏమీ ఆశించరు. తనకి వయోభారం మీద పడినప్పుడు కాస్తంత ప్రేమని మాత్రమే కోరుకుంటారు నాన్నలు. తాను కన్ను మూసినప్పుడు తలకొరివి పెడితే చాలనుకుంటారు ఆ నిస్వార్థపు నాన్నలు. నేటి కలియుగంలో, ఆధునిక సమాజంలో అలాంటి ప్రేమలు ఆప్యాయతలు కరువైపోతున్నాయి. తమ తల్లి తండ్రులు బ్రతికుండగానే కొంతమంది బిడ్డలకి బరువై పోతున్నారు. పేగు బంధాన్ని సైతం అపహాస్యం చేసే విధంగా కొందరు కొడుకులు ప్రవర్తిస్తున్నారు. తమ స్వార్థంకోసం, ఆర్థిక అవసరాలకోసం, నాన్న కూడబెట్టిన సిరిసంపదల కోసం చివరికి తమ నాన్నలనే అతి కిరాతకంగా పొట్టనబెట్టుకునే కసాయి కొడుకులు నేటి సమాజంలో వున్నారంటే అతిశయోక్తి కాదు. ఆలా జరుగుతున్న ఎన్నో ఉదంతాలు మనం తరచూ వార్తలలో చూస్తూనేవున్నాం, అక్కడా ఇక్కడా వింటూనే వున్నాం.

## తండ్రిని పాముతో కరిపించి కొడుకులే చంపేశారు!

తమిళనాడులో ఇటీవల ఓ తండ్రిని పాముతో కరిపించి మరీ చంపేశారు ఆయన ఇద్దరు కొడుకులు. ఓ పథకం ప్రకారం తమ తండ్రి పేరుతో 3 కోట్లకి బీమా చేయించారు ఆ దుర్మార్గులు. ఎలాగైనా ఆ డబ్బును చేజిక్కించుకోవాలనే దురాలోచనతో తమ నాన్ననే హతమార్చాలని వ్యూహం పన్నారు. తమపై ఎవరికీ అనుమానం రాకుండా తమ కన్న తండ్రిని పాముతో కాటువేయించి మరీ చంపేశారు. తామిద్దరినీ కంటికిరెప్పలా పెంచిన నాన్ననే విషసర్పానికి ఎరవేసి కాటికి పంపారు ఆ కసాయి అన్నదమ్ములు. అనంతరం ఆ ఇద్దరు కొడుకుల ప్రవర్తనలో తేడా గమినించి, సదరు తండ్రి మరణం తమకి అనుమానాస్పదంగా ఉందంటూ ఇన్సూరెన్స్ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఖాకీలు రంగంలోకిదిగారు. కేవలం తమ తండ్రి బీమా డబ్బుల కోసం కక్కుర్తిపడి, ఆ అన్నదమ్ములే ఇంతటి ఘోరానికి ఒడిగట్టినట్లు విచారణలో బయటపడింది. ఇప్పుడా ఇద్దరు కొడుకులూ జైల్లో వున్నారు. ఆస్తికోసమో, జూదం కోసమో, తాగుడు కోసమో ఏదో ఒక కారణంగా కన్న తండ్రిని పొట్టన పెట్టుకుంటున్న కిరాతక కసాయి కొడుకుల ఉదంతాలు అనేకం వెలుగు చూస్తూనే వున్నాయి. అదే తమిళనాడులోని తంజావూరులో మరో తాగుబోతు కొడుకు మద్యం తలకెక్కి తండ్రిని కుర్చీతో కొట్టాడు. ఆ దెబ్బలకి గాయపడిన తండ్రి ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకుని వస్తే, ఇంటికి రాగానే మళ్ళీ కర్రతో కొట్టి చంపేశాడు.

## అక్షరాస్యులు సైతం ఇదే బాటలో...!

కేవలం నిరక్షరాస్యులో లేదా అట్టడుగు వర్గాల్లోని వ్యక్తులో ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారా అంటే, అలా లేదనే సమాధానం వస్తుంది. ఎందుకంటే విద్యావంతులు, ఐటీ నిపుణులు సైతం ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నారు. తమిళనాడులోని చెంగల్పట్టులో జరిగిన ఓ సంఘటనే అందుకు ఉదాహరణ. ఓ ఐటీ ఉద్యోగికి తన పెళ్ళి విషయంలో తమ తండ్రితో గొడవయ్యింది. ఇద్దరికీ మాటా మాటా పెరిగింది ఫలితంగా సదరు యువకుడి చేతిలో దెబ్బలు తిని ఆ తండ్రి ప్రాణాలు విడిచాడు. ఎంతో కష్టపడి ఉన్నతస్థాయిలో చదివించుకున్న తన బిడ్డ చేతుల్లోనే ఆ తండ్రి హత్యకు గురికావడం అత్యంత దారుణం, హేయనీయం. ఇవన్నీ గత ఏడాది జరిగినవే. ఇలాంటివి కేవలం ఒక్క తమిళనాడులోనే కాదు, దేశమంతా అక్కడక్కడా జరుగుతూనే ఉన్నాయి. "పుత్రులై పుట్టి యమకింకరులై ప్రవర్తిస్తున్నారు" అన్న మాట నేటి సమాజంలోని ఇలాంటి దుర్మార్గపు కొడుకులకి సరిగ్గా సరిపోతుంది.

## కనుపాపలే పెను శాపమైతే!

బిడ్డలంటే నాన్నలు ప్రాణసమానంగా చూసుకుంటారు. ముఖ్యంగా కొడుకులంటే ప్రాణం పెడతారు. తమ కొడుకులే తమ వంశానికి వారసులని మురిపెంగా చూసుకుంటారు. వారిని లాలించి పాలించి పెంచుకుంటారు. తమ కనుపాపలలా కాపాడుకుంటారు. ఆలా కాపాడుకున్న తమ పాపాయిలే తమ పాలిట శాపాలుగా మారుతారని వారు కలలో కూడా ఊహించరు. తమకి తలకొరివి పెట్టాలని భావించే తమ బిడ్డే తమ ప్రాణాలని పొట్టన పెట్టుకుంటాడని ఏ తండ్రీ భావించడు. కానీ నేటి సమాజంలో అలాంటి సంఘటనలు రోజు రోజుకి ఎక్కువైపోతున్నాయి. తండ్రి ఆస్తులతో పాటు ఆయన గుణగణాలకి కూడా తాము వారసులమనే నిజం నేటి కొడుకులు గ్రహించాలి. నేటి కొడుకు కూడా రేపటి తండ్రే అన్నది గుర్తు పెట్టుకోవాలి. ఇలా తమ నాన్నని తాము చంపినట్లే రేపు తమ కొడుకు కూడా తనని చంపడని గ్యారెంటీ లేదు. ప్రతీ కొడుకూ ఇలా ఆలోచించాలి. తమ అమ్మా నాన్నలని దైవ సమానులుగా చూసుకోవాలి. తమ బిడ్డలకి కూడా అదే నేర్పించాలి. అమ్మా నాన్నలని నిర్లక్ష్యం చేసే సంస్కృతిని వీడి వృద్ధాప్యంలో వాళ్లని అక్కున చేర్చుకుని పాదపూజచేసే ఆచారాన్ని భావితరాలకి నేటి కొడుకులు, కూతుళ్ళు పరిచయం చేయాలి!

– రాజశ్రీ

## పార్టీలకి అతీతంగా కలుజు శంకుస్థాపన

# కోటంరెడ్డి కొత్త ఒరవడి





**పొట్టేపాళెం వంతెన పనులకు శ్రీకారం చుట్టాడు.. దశాబ్దాల కలను సాకారం చేస్తున్నాడు.**

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.. అంటే, చెప్పింది చేస్తాడని పేరు. అది ఎంత కష్టమైన పనైనా సరే.. పట్టుబట్టి సాధించి చూపించే ఎమ్మెల్యేగా ప్రజల మన్ననలు అందుకుంటున్నారాయన. తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల కోసం..నెల్లూరు రూరల్‌ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నాడు. ఇప్పటికే కోట్లాది రూపాయల వ్యయంతో రోడ్లను అభివృద్ధి చేసి, ఎక్కడో మారు మూలన ఉన్న గ్రామాల్లో కూడా విద్యుత్ వెలుగులతో శోభాయ మానం చేసి, ప్రజానేతగా జనం నుంచి ప్రశంసంలందుకుంటు న్నాడు. తాజాగా, దశాబ్దాల తరబడిగా ఎవరూ పట్టించుకోని పొట్టేపాళెం కలుజుపై వంతెన నిర్మాణానికి నడుం బిగించి, అందుకు శంకుస్థాపన కూడా వైభవంగా నిర్వహించారు. ఆ కార్యక్రమానికి జిల్లా రాజకీయరంగంలోనే గతంలో ఎప్పుడూ లేనివిధంగా పార్టీలకి అతీతంగా అన్ని పార్టీల నాయకులను ఆహ్వానించి, అందరి సమక్షంలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి.. కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టాడు.

### అన్ని పార్టీల నాయకులకి ఆహ్వానం...

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పొట్టేపాళెం కలుజు సంగతి జిల్లా ప్రజలకందరికీ తెలిసిందే. వానలు, వరదలు వచ్చి నప్పుడు ఆ మార్గంలో ప్రయాణించడమంటే నరకం కనిపిస్తుంది. ఈ అవస్థలు అనాదిగా ఉన్నవే. అయినా, ఎందరు నాయకులు వచ్చినా ఈ కలుజు సమస్య మాత్రం తీరేది కాదు. ఇక్కడ వంతెన నిర్మించి ప్రజల సమస్యలు తీర్చాలంటూ శ్రీధర్‌రెడ్డి పట్టుబట్టి ప్రభుత్వం నుండి దాదాపు 4కోట్లా 80లక్షల రూపాయల నిధులను సాధించారు. వంతెన నిర్మాణ శంకుస్థాపనకి జనవరి5న ముహూర్తం నిర్ణయించి, టీడీపీ నాయకులతో పాటు బీజేపీ, జనసేన, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ తదితర పార్టీల నాయకులతో శంకుస్థాపనోత్సవం జరిపించడం విశేషం! అధికారంలో ఉన్న ఎమ్మెల్యే పార్టీలకతీ తంగా అభివృద్ధి కార్యక్రమాల్లో అన్ని పార్టీల నాయకులను భాగ స్వాములను చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇలా వినూత్న మైన రీతిలో శ్రీధర్‌రెడ్డి ఓ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టడం పట్ల రాజకీయవర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో అన్ని పార్టీల ముఖ్యనేతలు పాల్గొన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నగర ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో పాటు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జనసేన నాయకులు గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్, సీపీఐ నాయకులు పముజుల దశరథ రామయ్య, అరిగెల నాగేంద్రసాయి, సీపీఎం నాయకులు జనార్దన్ తదితరులు పాల్గొని శ్రీధర్‌రెడ్డిని అభినందించడం విశేషం!

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, కోటంరెడ్డి ప్రజల మనిషి అని, జనం కోసం ఏ పని చేయాలనుకుంటే ఆ పనిని ఎంత కష్టమైనా సరే.. సాధించి తీరుతాడని కొనియాడారు. నిరంతరం ప్రజలకి అండగా ఉండబట్టే మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, హ్యాట్రిక్ ఎమ్మెల్యే అయ్యాడంటూ ప్రశంసించారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత లోకేష్‌లు పొట్టేపాళెంలో బ్రిడ్జి నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఇదేవిధంగా, త్వరలో ములుముడి బ్రిడ్జి వంతెనకి కూడా శంకుస్థాపన చేసి, ఆ నిర్మాణాన్ని కూడా కొద్ది నెలల్లోనే పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.


**పొలం అమ్మబడును**

జాతీయ రహదారికి 1.5 కిలోమీటర్ల దూరంలో, గొలగమూడికి వెళ్ళే దారిలో, కంటేపల్లి గ్రామంలో, తారురోడ్డు ఫేసింగుతో వెంచర్లకు అనువైన 12 యకరముల పొలం అమ్మబడును.

ఆసక్తి కలవారు
**93471 00164**
నంబరు నందు సంప్రదించగలరు.



**మాతృదేవోభవ**

ఆప్యాయతానురాగాలు పంచిన అమృతమూర్తి
మా ఇంటి ఆరాధ్యదైవం, మా తల్లిగారైన
**శ్రీమతి సోమిరెడ్డి హైమావతమ్మ గారు**
మమ్మ వీడి దైవసన్నిధికి చేరి పన్నెండేళ్ళ గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...
కన్నీటి నివాళులతో...

కుమారులు: **సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి**
సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు
**లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి**

కుమార్తెలు - అల్లుళ్ళు
**కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి**
**కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి**

| మనుమలు | - | మనుమరాండ్రు | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | - | శ్రుతి | యల్లా శర్వీన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | - | డా॥ లక్ష్మీ ఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | - | నీలిమ | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రీతిక |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | - | డా॥ సింధు | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి | - | షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | | | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి | - | కీర్తి | సోమిరెడ్డి రణదేవ్ | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | - | స్నిగ్ధ | సోమిరెడ్డి అగస్త్య | సోమిరెడ్డి లక్ష్మీ ధాత్రి |



# రెడ్‌క్రాస్‌లో.. రక్తదాన దినోత్సవం




జీన్ హెన్రి డ్యూనాంట్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్లా

రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు జీన్ హెన్రి డ్యూనాంట్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నెల్లూరులో ఈనెల 7న జరిగింది. జిల్లా కలెక్టర్ మరియు రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ హిమాన్ను శుక్లా ఈ కార్యక్రామాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విగ్రహ దాత కలికి శ్రీహరిరెడ్డి (కోఆర్డినేటర్– రెడ్ క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్)ని కలెక్టర్ అభినందించారు. అనంతరం రెడ్ క్రాస్ రక్త నిధి కేంద్రంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవ కార్యక్రమ వేడుకలు జరిగాయి. అత్యధిక సార్లు రక్తదానం చేయించిన రక్త ప్రేరేపకులు 135 మందికి జ్ఞాపికలు మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. కలెక్టర్‌తో పాటు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ చమర్తి జనార్ధన్‌రాజు, కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు డి.రవిప్రకాష్, రక్తనిధి కో–ఆర్డినేటర్ మరియు మేనజింగ్ కమిటీ మెంబర్ బయ్యా ప్రసాద్, మేనేజింగ్ కమిటీ సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, యడవలి సురేష్, గునపాటి ప్రసాద్‌రెడ్డి, యాలమూరి రంగయ్యనాయుడు, దాసరి రాజేంద్రప్రసాద్ పాల్గొని జీన్‌హెన్రి డ్యూనాంట్ మరియు డాక్టర్ డా. జీ.జోలీ చిత్రపటాలకి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రెడ్ క్రాస్ మాజీ ఛైర్మన్ డా. ఏ.వి.సుబ్రమణ్యం, యం.డి. జూబేర్, రెడ్ క్రాస్ సెక్రటరీ పి.మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ మూడుజిల్లాల గవర్నర్‌గా..
# బలరామయ్యనాయుడు



నెల్లూరు–ప్రకాశం–గుంటూరు జిల్లాల వాకర్స్ నాయకుడు, నెల్లూరులోని వాకర్స్‌కి అత్యంత ఆత్మీయులైన నలుబోలు బల రామయ్యనాయుడు 203–జిల్లా గవర్నర్‌గా ఈనెల 11న పదవీ స్వీకారం చేయనున్నారు. నెల్లూరు లోని ఏసీ స్టేడియం సమీపంలో ఉన్న కిలారి తిరుపతినాయుడు కల్యాణమండపంలో వేడుకగా జరుగనున్న ఈ కార్యక్రమంలో వాకర్స్ ఫస్ట్ లేడీగా బలరామయ్యనాయుడి సతీమణి ఎన్.పద్మావతి ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ముఖ్యఅతిథి మరియు ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా.. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ పీ.రవిరాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ప్రెసిడెంట్ ఎం.వి.సుబ్బా రెడ్డి పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్–2025 పెద్ది శివరామ్ ప్రసాద్ నుంచి బలరామయ్యనాయుడు మూడు జిల్లాల వాకర్స్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇంటర్నే షనల్ వాకర్స్–2017 ప్రెసిడెంట్ చెలికాని సీతారామయ్య, వాకర్స్ నాయకులు ఏకొల్లు రాఘవరెడ్డి, పలగాటి శ్రీనివాసులురెడ్డి, కోనేటి రవిరాజు, సీహెచ్ మునికృష్ణయాదవ్, షేక్ లాల్‌వజీర్, ఎస్.రాఘవేంద్ర షెట్టి, ఎం. వెంకటాద్రిరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని, వాకర్స్ అందరూ తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా నిర్వాహకులు కోరారు.

# నెల్లూరు కబుర్లు

## మాగుంట లేఅవుట్ అండర్‌బ్రిడ్జి వద్ద
# కొత్త మోటార్ల ఏర్పాటు



మోటార్లను ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్

వానొస్తే చాలు.. నీటిప్రవాహంతో రాకపోకలకు ఎంతో ఇబ్బందిగా ఉండే నెల్లూరులోని మాగుంట లేఅవుట్ అండర్‌బ్రిడ్జికి ఎట్టకేలకి మోక్షం కలిగింది. ఎప్పటికప్పుడు నీటిని తోడేసేందుకు 40.70 లక్షల రూపా యలతో ఏర్పాటుచేసిన క్రొత్త మోటార్లను, ఆధునీకరించిన ఫుట్‌పాత్‌లను ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నాయకుడు.. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి ఈనెల 7న ప్రారంభించారు. రామలింగాపురం అండర్‌బ్రిడ్జి తరహాలో మాగుంట లేఔట్ అండర్ బ్రిడ్జిని కూడా ఆధునీక రించి ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు అన్నారు. మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, క్లస్టర్ ఇంచార్జ్ నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎం నేతలతో ఇన్‌చార్జి మేయర్ భేటీ

ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నెల్లూరు నగర ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్ చెప్పారు. బుధవారం ఆయన నెల్లూరు బాలాజీనగర్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రూప్‌కుమార్ మాట్లాడుతూ వామపక్ష పార్టీలంటే తనకు ఎంతో గౌరవ మన్నారు. ప్రజా సమస్యలకు సంబంధించి పరిష్కారంలో తనవంతు భాగస్వామ్యం ఎప్పుడూ ఉంటుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, నాయకులు ఎం.మోహన్‌రావు, సిఐటియు జిల్లా నేత అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# సంక్రాంతికి ఆర్టీసీ..ప్రత్యేక బస్సులు

సంక్రాంతి పర్వదినాల సందర్భంగా దూరప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణీకుల సౌకర్యార్ధం ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు సుమారు 36 ప్రత్యేక బస్సులను నడపాలని అధికారులు నిర్ణయించారు. దూరప్రాంతాల్లో ఉన్న ప్రయాణీకులకు..హైదరాబాద్ నుంచి 18, బెంగళూరు నుంచి 10, ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే వసూలు చేస్తామని, ప్రయా ణీకులకు అవసరమైతే మరిన్ని బస్సులు నడిపేందుకు కూడా సిద్ధమని అధికారులు చెప్తున్నారు.

# కన్నులపండువగా..శ్రీ త్యాగరాజస్వామి ఆరాధన


నెల్లూరు నగరంలోని వేదాయపాలెంలో ఉన్న శ్రీ త్యాగరాజస్వామి మందిరంలో ఇటీవల 179వ సద్గురు శ్రీ త్యాగరాజస్వామి వారి ఆరాధన మహోత్సవం ఈనెల 7వతేదీ వేడుకగా జరిగింది. మాచవోలు వెంకట సుబ్బయ్య భాస్కర్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజస్వామి వారి ఆరాధనను కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తనతో ప్రారంభించి స్థానిక సంగీత కళాకారులచే సంగీత గురువులు జె.బాలార్క, లక్ష్మీప్రసన్న, రమాదేవి, లక్ష్మీకామాక్షమ్మ, అరుణ, సత్యవాణి తదితరులు, వీణపై నాగలక్ష్మి,హేమలక్ష్మి, పద్మచక్రవర్తి, వయోలిన్‌పై లోకేష్, ఏ.సుబ్రహ్మణ్యం అచ్యుత్ భట్, వనజ, మృదంగంపై హరి, ఈశ్వర్‌పాయ్, శివకుమార్, ఏ.సుబ్రహ్మణ్యం మొదలగువారిచే పంచరత్న గోష్ఠిగానం ఆద్యంతం అద్భుతంగా ఉండి భక్తులను ఆకట్టుకుంది.

# హౌసింగ్ పీడీగా.. మోహన్‌రావు

జిల్లా గృహనిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారిగా జడ్పీ డిప్యూటీ సీఇఓ మోహన్‌రావుని నియమిస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. హౌసింగ్ పీడీగా పనిచేస్తున్న వేణుగోపాల్ సరెండర్ కావ డంతో, ఆ బాధ్యతలను మోహన్‌రావుకు అప్పగించారు.




## థాయిల్యాండ్‌లోని నెల్లూరీయునికి..
# మంత్రి నారాయణ సాయం



థాయిల్యాండ్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న నెల్లూరు వాసి నవీన్‌కుమార్‌కు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తనవంతు చేయూతనందిస్తున్నారు. ఏపీ ఎన్‌ఆర్టీ చైర్మన్ వేమూరి రవి, ఢిల్లీలోని ఏపీ రెసిడెంట్ కమీషనర్ ప్రవీణ్ కుమార్‌లకు ఈ సమాచారం అందించి బాధితునికి అండగా నిలవాలని కోరారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరుసిటీ మూడోడివిజన్ మైపాడుగేట్ సెంటర్‌కు చెందిన నవీన్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం చేసేం దుకు హైదరాబాద్ వెళ్ళాడు. అక్కడే ఉంటూ అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. ఆ తర్వాత అక్కడనుంచి థాయిల్యాండ్‌కు వెళ్ళి అకస్మాత్తుగా అనారోగ్యం పాలై కుప్పకూలిపోయాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన నవీన్‌కుమార్‌ను స్నేహితులు ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతున్న నవీన్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పటంతో, వారు నెల్లూరులోని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దిక్కుతోచని అయోమయ స్థితిలో ఉన్న వారి బంధువులు మంత్రి నారాయణకు ఆ విషయం తెలియజేయడంతో, మంత్రి వెంటనే స్పందించారు. నవీన్‌కు అన్ని విధాలా సహాయ సహకా రాలు అందించి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.

# కరెంటోళ్ల 'జనబాట'

విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించిపరిష్కరించే ఉద్దేశ్యంతో ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చేపట్టిన 'కరెంటోళ్ల జనబాట' కార్యక్రమం ఈనెల 6న నెల్లూరులో జరిగింది. విద్యుత్ శాఖ ఎస్‌ఇ కె.రాఘవేంద్రం ఆధ్వర్యంలో నగరంలోని బీవీ నగర్ సెక్షన్ నక్కలగుంట ప్రాంతంలో విద్యుత్ సిబ్బంది పర్యటించి అక్కడి వినియోగదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామ సచివాలయం వద్ద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఇ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తామని, లూజ్ లైన్లు, దెబ్బతిన్న కరెంటు స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగలడం వంటి సమస్యలను యాప్‌లో నమోదు చేసి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినియోగదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టౌన్ ఏఇ శ్రీధర్, డిప్యూటి ఏఇ అశోక్, ఏఏఇ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బధిర ఉద్యోగుల సంఘం..క్యాలెండర్ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ బదిర ఉద్యోగుల సంఘం జిల్లాశాఖ వారు ఇటీవల నూతన సంవత్సర క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. స్థానిక దర్గామిట్టలోని ఎన్జీఓహోమ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, గాదిరాజు రామకృష్ణల చేతుల మీదుగా క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. ఆ సంఘం ప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గురునిలయంలో.. మాకాని స్వామి ఆరాధన



నెల్లూరు మూలాపేటలోని గురు నిల యంలో ఈనెల 6న భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ప్రియశిష్యులైన మాకాని వెంకట్రావు స్వామి 8వ ఆరాధనోత్సవం వైభవంగా జరి గింది. గురు నిలయం నిర్వాహకులు మాకాని గోపి ఆధ్వర్యంలో అగ్నిగుండం పూజలు, స్వామివార్లకు పూలంగిసేవ, ప్రత్యేక అభిషేక సేవలు జరిగాయి. అనం తరం భక్తులకు అన్నదానం చేశారు. శ్రీ వెంకయ్యస్వామి శిష్యులు.. తుమ్మల తలుపూరులోని శ్రీ నారాయణదాసుస్వామి, హైకోర్టు సీనియర్ న్యాయవాది చంద్ర, డాక్టర్ సాంబశివరావు, చిల్డ్రన్స్‌పార్కులోని శ్రీ సాయి మందిరం ఛైర్మెన్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మురుగు కాలువల పరిశుభ్రత

నెల్లూరు నగరంలో కార్పొరేషన్ వారు మురుగు కాలువలను పరి శుభ్రం చేస్తున్నారు. కమిషనర్ నందన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఈనెల 6న ఎస్‌విజీఎస్ కళాశాల ప్రాంతంలో జరిగింది. మురుగునీటి కాలువల్లో ఉన్న వ్యర్థాలను ఎస్క్యులేటర్‌తో తొలగించి శుభ్రం చేశారు. కాలువల్లో తొలగించిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ కోసం డంపింగ్ యార్డ్‌కు తరలించాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు.

# పేదపిల్లలకు విద్యను ఆస్తిగా అందించాలి

## మంత్రి నారాయణ


విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న మంత్రి నారాయణ

పేదపిల్లలకు విద్యనే ఆస్తిగా, వారికి మెరుగైన విద్యనందించేందుకు కృషి చేస్తున్నానని, మంచి విద్యతోనే విద్యార్థులకు భవిష్యత్ బాగుంటుందని రాష్ట్ర పురపాలక మంత్రి డా. పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని కాపు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని, బలిజ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తనకు చదువే ఈ స్థాయిని ఇచ్చిందని కూడా మంత్రి వెల్లడించారు. ఇప్పటికే నెల్లూరులో వీఆర్ విద్యాసంస్థలని అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రారంభించామన్నారు. 200 కోట్లతో మరో 14 స్కూల్స్‌ని వీఆర్‌సీకి మించి సిద్ధం చేస్తున్నామన్నారు. వక్ఫ్ బోర్డు స్థలంలో 20 కోట్లతో మరో ఇంటర్ నేషనల్ స్కూల్ నిర్మిస్తున్నామనీ వివరించారు. కాపు భవన్ నిర్మాణం బలిజ కులస్థులకు ఎప్పటి నుంచో ఒక కలగా ఉండేదని, 2014లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కాపు భవన్‌ల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. తన వంతుగా కాపుభవన్‌కి కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించానని మంత్రి తెలిపారు. అదనపు అంతస్తు నిర్మాణానికి తాజాగా మరో కోటి రూపాయలు ఇస్తున్నట్లు ప్రకటించారు. తులసి రామచంద్ర ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# రాజముద్రతో.. పట్టాదారు పాసుపుస్తకాలు!

## • హసనాపురంలో రైతులకు అందజేసిన మంత్రి ఆనం


రైతులకి రాజముద్రతో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాన్ని అందజేస్తున్న మంత్రి ఆనం

'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు సంపూర్ణమైన భూ యాజమాన్య హక్కులు కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ప్రమాణాలతో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను ఇటీవల రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పంపిణీ చేశారు. గత ప్రభుత్వం గత ముఖ్యమంత్రి ఫోటోలతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలు రద్దుచేసి ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పట్టాలను పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఇటీవల ఆయన ఏఎస్‌పేట మండలం హసనాపురంలో రైతులకు వాటిని అందజేస్తూ, రైతుకు అన్నం పెట్టే భూమికి, రైతును రాజుగా చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అధికారం చేపట్టిన తొలి మంత్రివర్గ సమావేశంలోనే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గత ప్రభుత్వం రైతులకు ద్రోహం చేసేలా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం జరిగిందన్నారు. ప్రతి నెల ఒకటి నుంచి ఏడో తేదీ లోపు ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో కొనసాగిస్తామన్నారు. ప్రతి నెల 9వ తారీకు ఏదో ఒక గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తారని ఆయన చెప్పారు. పట్టాదారు పాస్ పుస్తకాల్లో ఏ చిన్న తప్పు దొర్లినా.. వెంటనే సరి చేస్తామన్నారు. 2026 డిసెంబర్ చివరి నాటికి రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసి.. ప్రజలకు, రైతులకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

# 'తేజస్' యుద్ధ విమానం.. భారత్ ప్రతిభకు నిదర్శనం

## • డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్ డా. సతీష్‌రెడ్డి


తేజస్-25 సదస్సుల్లో పాల్గొన్న డా. సతీష్‌రెడ్డి, వైమానిక దళ అధిపతి ఏపీ సింగ్ తదితరులు

'తేజస్' యుద్ధ విమానం.. భారత్ సాంకేతిక ప్రతిభాపాటవాలకి నిదర్శనమని ప్రముఖ శాస్త్రవేత్త, డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్, ఏపీ ప్రభుత్వ గౌరవ సలహాదారు డా. సతీష్‌రెడ్డి చెప్పారు. భారత రక్షణ రంగ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే 'తేజస్'యుద్ధ విమానం తొలిసారి (జనవరి 4, 2001) నింగిలోకి దూసుకువెళ్ళి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 4న బెంగళూరులో నిర్వహించిన బెంగళూరులో తేజస్–25 జాతీయ సదస్సులో ఆయన పాల్గొని, భారత రక్షణ రంగం సాధిస్తున్న విజయాలను ప్రస్తుతించారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన తేజస్ విమానం భారత వైమానిక దళ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పి పాతికేళ్లు కావడం దేశానికే గర్వకారణమన్నారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించి ఆత్మనిర్భర్ భారత్ దిశగా మన దేశం అడుగులు వేసేందుకు తేజస్ మార్గదర్శిగా నిలిచిందన్నారు. వైమానిక దళ అధిపతి ఏపీ సింగ్, అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అధినేత డాక్టర్ వి.నారాయణన్ తదితరులు మాట్లాడుతూ ఏరోనాటిక్స్, డిఫెన్స్ టెక్నాలజీ రంగాల్లో భారత్ సాధించిన ప్రగతికి తేజస్ ఒక మైలురాయిగా నిలుస్తోందని తెలిపారు. రానున్న కాలంలో తేజస్ యుద్ధ విమానానికి మరింత ఆధునీకరించడంతో పాటు, దేశీయ రక్షణ తయారీ రంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.




# నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

## • కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి


సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు అండగా నిలుస్తోందని, ఎంతో మంది బాధితులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమం ద్వారా ఆదుకుంటున్నారని ఆ టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో రూరల్ నియోజకవర్గంలో 42 మంది పేదలకు 44 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆర్థిక స్థోమత లేని వారికి ముఖ్యమంత్రి సహాయనిధి సంజీవినిలా నిలుస్తోందని ఆయన చెప్పారు.

# నేత్రపర్వం..ముగ్గురమ్మల గ్రామోత్సవం




అల్లూరులో ఈనెల 6వ తేదీ మంగళవారం నాడు అల్లూరు గ్రామదేవతలైన గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ ఉత్సవ వేడుకల్లో భక్తులు వేలసంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి అమ్మవార్లకు చద్ది నైవేద్యాన్ని సమర్పించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండేలా అనుగ్రహించు తల్లీ..అంటూ ప్రార్థించారు. ఈ సందర్భంగా పోలేరమ్మ ఆమ్మవారికి బంగారుచీరను అలంకరించి, ప్రత్యేకపూజలు చేశారు. ఉత్సవాలని పురస్కరించుకుని నిర్వాహకులు చేపట్టిన సాంస్కృతిక సంబరాలు అందరినీ అలరించాయి.



# జిల్లా వాసుల దాహం తీరుస్తున్న 'విపిఆర్ అమృతధార'

## సర్వేపల్లి, కోవూరు, కావలి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో వాటర్ ప్లాంట్లు



ముంగలదొరువులో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వేమిరెడ్డి, సోమిరెడ్డి

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో దాహార్తితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు పరిశుద్ధ జలాన్ని అందజేస్తూ.. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో, విపిఆర్ ఫౌండేషన్ సారధ్యంలో చేపట్టిన విపిఆర్ అమృతధార కార్యక్రమంలో భాగంగా ఇటీవల జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాటర్‌ప్లాంట్‌లను ప్రారంభించారు.

### సర్వేపల్లి నియోజకవర్గంలో :

సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండలం ముంగలదొరువు గ్రామంలో నెలకొల్పిన అమృతధార వాటర్ ప్లాంట్‌కి ఇటీవల విపిఆర్ ప్రారంభోత్సవం చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ.. టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర తదితరులు పాల్గొని విపిఆర్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, సమాజ సేవ కోసమే తాము విపిఆర్ ఫౌండేషన్ స్థాపించామని, 2017లో విపిఆర్ అమృతధార పేరిట ఉదయగిరి ప్రాంతంలో తొలి వాటర్ ప్లాంట్ ప్రారంభించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికి 190 వాటర్ ప్లాంట్లు పెట్టి ప్రజల దాహార్తి తీరుస్తున్నామన్నారు.

### కోవూరు నియోజకవర్గంలో :

కోవూరు నియోజకవర్గం విడవలూరు మండలంలోని రామతీర్థం గ్రామంలో ఏర్పాటు చేసిన అమృతధార వాటర్ ప్లాంట్‌ని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు ఇటీవల ప్రారంభించారు. కోవూరు మండలంలో ఒకేరోజున 3 విపిఆర్ అమృతధార వాటర్ ప్లాంట్లకు ప్రారంభోత్స వాలు చేశారు. కోవూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, పడుగుపాడులో వాటర్‌ప్లాంట్లను ప్రారంభించారు. టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కావలిలో..

కావలి మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో ఏర్పాటుచేసిన విపిఆర్ అమృతధార వాటర్‌ప్లాంట్‌ని ఈ నెల 4న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి వేమిరెడ్డి ప్రారంభించారు.

### నెల్లూరు రూరల్‌లో..

నెల్లూరురూరల్‌లోని పొట్టేపాళెం గ్రామంలో ఈనెల 5న విపిఆర్ దంపతులు అమృతధార వాటర్‌ప్లాంట్‌కి విపిఆర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చడం తమకెంతో సంతృప్తిని కలిగిస్తోందని, ప్రజా సేవ కోసమే తాము రాజకీయాల్లోకి వచ్చామని, తమ పదవులకున్న ఎంపీ, ఎమ్మెల్యే అనే అక్షరాలు ప్రజాసేవకే అంకితమన్నారు.

# సాహిత్యాభిమానులను ఆకట్టుకున్న.. 'మన తెలుగు సిరిసంపదలు'



ఊరిమిండి నరసింహారెడ్డిని సత్కరిస్తున్న ముఖ్యఅతిథులు, చేతన నిర్వాహకులు

నెల్లూరులోని చేతన సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 6న స్థానిక టౌన్‌హాలు ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాలులో జరిగిన 'మన తెలుగు సిరిసంపదలు–సాహిత్యంలో చమత్కారం' అనే అంశంపై జరిగిన కార్యక్రమం తెలుగు భాషాభిమానులను, సాహిత్యకారులను బాగా ఆకట్టుకుంది. డాలస్(అమెరికా)లోని టెక్సాస్ నుండి వచ్చిన ప్రముఖ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగు నిపుణులు, శంకరనేత్రాలయ యుఎస్ఏ పాలకమండలి సభ్యులు, డా. ఊరిమిండి నరసింహారెడ్డి ప్రధాన వక్తగా పాల్గొని తెలుగు సారస్వతంలో చమత్కారభరితమైన సాహిత్య ప్రయోగాలను తెలియజేశారు. పూర్వకాలం నుంచి ఉన్న తెలుగు పద్యాలు, చమత్కారాలు, ప్రహేళికల విశిష్టతను అందరికీ అర్థమయ్యేవిధంగా విశదీకరించారు. తెలుగుభాషలో చమత్కారాలు అద్భుతంగా ఉంటాయని ఉదాహరణలతో సహా వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ, 'మన తెలుగు సిరిసంపదలు' వంటి అంశాలు మన సాహిత్యంలోని గొప్పదనాన్ని ఎంతగానో చాటుతాయని ప్రశంసించారు. ఇమామి ఆగ్రోటెక్, కృష్ణపట్నం ఉపాధ్యక్షులు యం.వి. నారాయణమూర్తి, ప్రముఖ సినీ మాటల రచయిత పి.రాజేంద్రకుమార్ పాల్గొని, మన తెలుగు సాహిత్యం మానవ వికాసానికి అద్భుత సాధనం అంటూ కొనియాడారు. మురళీకృష్ణ పిక్నిక్ ఐస్‌క్రీమ్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు తదితరులు పాల్గొని ముఖ్య వక్త డా. ఊరిమిండి నరసింహారెడ్డిని సన్మానించారు. సభను చేతన సంస్థ నిర్వాహకులు వై.శేషగిరీశం ప్రారంభించగా, వీఆర్‌సీ విశ్రాంత ప్రిన్సిపాల్ డా. ఎం. సుబ్రహ్మణ్యం నిర్వహించారు. నగరంలోని పలువురు సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఇటీవల గూడూరు ఎమ్మెల్యే డా. పాశిం సునీల్‌కుమార్, నాయుడుపేట డీఎస్పీ గొట్టిపాటి చెంచుబాబులను కలుసుకొని శుభాకాంక్షలు తెలుపుతున్న 'లాయర్' గూడూరు డివిజన్ ప్రతినిధి, బ్రాహ్మణ సేవాసంఘం గూడూరు అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్

## పాలిటెక్నిక్ కాలేజీకి లక్ష రూపాయల స్కాలర్‌షిప్



స్కాలర్‌షిప్ చెక్కును అందజేస్తున్న రఘురామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి

గూడూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థి, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మరియు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ మాజీ డైరెక్టర్(హెచ్ఆర్) వై.రఘురామిరెడ్డి పాలిటెక్నిక్ కళాశాలకి స్కాలర్‌షిప్ క్రింద లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఎల్ఏపి స్కూల్ కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో ఆ విరాళం చెక్కుని కళాశాల ప్రిన్సిపాల్‌కి అందజేశారు. తమ సోదరి బుస్సారెడ్డి కుంతలమ్మ, బావమరిది ఎల్ఏపి స్కూల్ ఛైర్మెన్ బుస్సారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డిల జ్ఞాపకార్థం ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ స్కాలర్‌షిప్‌ను అందజేయడం జరుగుతోందని రఘురామిరెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

## టూటౌన్‌లో కార్డెన్‌సెర్చ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న టూటౌన్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది

గూడూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అదవయ్య కాలనీలో సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు రోడ్డు భద్రత, గంజాయి వినియోగ నివారణ, సైబర్ నేరాలు, ఇతర అక్రమ కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. తమ పరిసరాలలో ఎటువంటి అక్రమ కార్యకలాపాలు గమనించినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అలాగే డయల్ 112 అత్యవసర సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ శేఖర్‌బాబు, చిల్లకూరు, గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్లకు చెందిన ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రగతి సేవా వారోత్సవాలు



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ప్రగతి సేవా సంస్థ సభ్యులు

గూడూరులోని ప్రగతి సేవాసంస్థ 6వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 2వతేదీ నుండి 12వతేదీ వరకు ప్రగతి వారోత్సవాలను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా పయ్యావుల మురళీ నాయుడు సహకారంతో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 5న చెన్నూరు, మొదటి హరిజనవాడలోని 30 మందికి చీరలు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## లైబ్రరీకి రోటరీ డెస్క్‌టాప్

గూడూరు రెండవ పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 3వతేదీ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రొటేరియన్ ఆర్.వి. సుబ్రహ్మణ్యం, భరణి దంపతుల దాతృత్వంతో లైబ్రరీకి అవసరమైన డెస్క్‌టాప్, పుస్తకాలు, కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ రొటేరియన్ బి.దశరథరామిరెడ్డి మాట్లాడుతూ... పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన విద్యార్థులందరూ గొప్ప స్థాయిలో ఉన్నారని, విద్యార్థులకు రోటరీ క్లబ్ ద్వారా సహాయసహకారాలను అందించడం జరుగుతుందని తెలియజేశారు. క్లబ్ కార్యదర్శి మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ సురేష్‌రెడ్డి, ఎన్.బాలకృష్ణంరాజు, శ్రీధర్‌రెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్ పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవా సంఘం ముగ్గుల పోటీలు

గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ ముగ్గుల పోటీలు జరుగనున్నాయని, గూడూరు రెండో పట్టణ పరిధిలోని శ్రీ ముంగమూరు సీతమ్మ గారి బ్రాహ్మణ భవనం నందు ఉదయం 9 గంటల నుండి 11.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగునుందని సంఘ అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరావు, ట్రెజరర్ లలిత ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనదలచిన మహిళలు 94404 50452, 8639162403, 9959109108 నెంబర్లకు ఫోన్‌చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, గెలుపొందిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని తెలిపారు.



గూడూరు, త్యాగరాజవీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో ఇటీవల రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న డా. సి.రోహిణి, సౌజన్య, ఇతర సభ్యులు.

## వెంకటాచలం ఆరోగ్యకేంద్రం

# సేవలు..అభినందనీయం

### ఎమ్మెల్యే సోమిరెడ్డి



సిఆర్‌సి వార్షికోత్సవంలో పాల్గొన్న సోమిరెడ్డి

నెల్లూరుజిల్లాలోని వెంకటాచలంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి(సిఆర్‌సి) ఇటీవల జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. దివ్యాంగులకు సేవలందించడంలో ఈ ఆరోగ్య కేంద్రం ప్రథమస్థానంలో ఉండడం ఎంతైనా విశేషం. దేశంలో 9 సిఆర్‌సి ఆరోగ్యకేంద్రాలు ఉండగా, వెంకటాచలంలోని కేంద్రం జాతీయస్థాయిలో అగ్రగామిగా ఉండడం పట్ల మాజీమంత్రి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆ కేంద్రంలోని సిబ్బందిని అభినందించారు. ఇటీవల ఆ కేంద్రం 10వ వార్షికోత్సవం సందర్భంగా వెంకటాచలంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గతంలో కేంద్రమంత్రిగా, తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఏర్పాటైన ఈ ఆరోగ్య కేంద్రం ఇప్పుడు జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఉండటం సంతోషకరమన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని వివిధ పారిశ్రామిక సంస్థల సహకారం, సీఎస్‌ఆర్ నిధులతో పేద, మధ్య తరగతి ప్రజలకు సేవలందించేందుకు ఈ కేంద్రం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఇప్పటి వరకు దాదాపు లక్ష మందికి పైగానే దివ్యాంగులకు పునరావాసం, అవసరమైన థెరపీ సేవలు అందించడం జరిగిందని, వివిధ అంశాల్లో శిక్షణ పొందిన 35 మంది దివ్యాంగులు ఈ కేంద్రంలో ఉద్యోగాలు పొందడం సంతోషం కలిగిస్తోందని అన్నారు. దివ్యాంగులకు సేవలందించేందుకు స్మైల్స్ ఫౌండేషన్, కిమ్స్ హాస్పిటల్ ముందుకు రావడం శుభపరిణామమన్నారు. అదేవిధంగా, చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇక్కడ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని, ఉదయం వేళల్లో వెంకయ్యనాయుడు కుమార్తె దీపమ్మ ఈ కేంద్రంలోని వారందరికీ ఉపాహారం ఏర్పాటు చేస్తున్నారని, ఇలా అందరి సహకారంతో ఈ కేంద్రం దివ్యాంగులకు సేవలు అందించడంలో ముందు నిలుస్తోందని చెప్పారు.

# మహనీయురాలు..సావిత్రిబాయి పూలే

### జనసేన నాయకుల నివాళి



సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

భారత మహిళా ఉద్యమ చరిత్రలో సావిత్రిబాయి పూలే పాత్ర అద్వితీయమని, మహిళా రంగానికి.. మహిళల విద్యకు ఆమె చేసిన సేవలు అపారమని జనసేన నాయకుడు గునుకుల కిషోర్ కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక మినీ బైపాస్‌రోడ్డులో ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుల సేవలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం.. నాటి సమాజంలో స్త్రీలకు చదువెందుకనే రోజుల్లో.. మహిళలకు విద్య అవసరమంటూ ఆమె చేసిన పోరాటం అసామాన్యమైనదన్నారు. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయిపూలే శాశ్వతమైన కీర్తిని అందుకున్నారని, ఆమె సేవలు నేటి యువతరానికి మార్గదర్శకమని అన్నారు. మహిళలు రాజకీయాల్లోకి రావాలని జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆకాంక్ష అని, వారు చేపట్టిన మహిళా సాధికారత, సమానత్వ విధానాలు సావిత్రిబాయి పూలే ఆశయాలకు అనుగుణంగా ఉండడం సంతోషకరమని అన్నారు. నాగేంద్రబాలు, నరహరి, కృష్ణమోహన్‌రెడ్డి, వర్షన్, కేవీఆర్ రమణ, వెంకటరమణ, హరి తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ అమెరికా 'పెద్దన్న' వైఖరి




వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అర్ధరాత్రి వేళ అమెరికా దళాలు అపహరించిన తీరు ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ఒక సార్వభౌమాధికార దేశానికి అధ్యక్షుడైన వ్యక్తిని ఈ విధంగా అపహరించుకెళ్లడం విస్మయానికి గురి చేసింది. ఈ ఉదంతంతో పాటు ఇటీవల అమెరికా వివిధ అంశాల్లో వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే ఆ దేశం మరోసారి పెద్దన్న పాత్ర పోషిస్తోందని అర్థమవుతోంది. ప్రపంచ రాజకీయ యవనికపై అమెరికా తనను తాను 'ప్రపంచ రక్షకుడి'గా అభివర్ణించుకుంటుంది. కానీ, గడచిన కొన్ని దశాబ్దాలుగా, ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత చోటు చేసుకుంటున్న పరిణామాలు చూస్తుంటే, అమెరికా ఆడుతున్నది 'శాంతిదూత' పాత్ర కాదు, 'పెద్దన్న' పాత్ర అని స్పష్టమవుతోంది.

**తర్కానికి అందని కారణాలు:** మాదకద్రవ్యాలను అక్రమంగా అమెరికాలోకి రవాణా చేస్తున్న ముఠాలకు మదురో అండగా ఉంటున్నారన్న కారణం చెబుతూ అమెరికా ఈ చర్యకు పాల్పడింది. అయితే ఇక్కడే ఒక ప్రాథమిక ప్రశ్న తలెత్తుతోంది. వేరే దేశపు సైనిక స్థావరంలో, పకడ్బందీగా ఉన్న ఒక దేశాధ్యక్షుడిని బంధించగలిగే సైనిక సామర్థ్యం ఉన్న అమెరికాకు, తన సొంత సరిహద్దుల్లో జరుగుతున్న మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను, అక్రమ వలసలను అడ్డుకునే సామర్థ్యం లేదా? ఖచ్చితంగా ఉంది. కానీ, అమెరికా లక్ష్యం మాదకద్రవ్యాల నిర్మూలన కాదు; వెనెజువెలాలోని అపారమైన చమురునిల్వలపై పెత్తనం. తమకు నచ్చని సిద్ధాంతాలు కలిగిన ప్రభుత్వాలను కూల్చివేయడం ద్వారా ఆయా దేశాల సహజ వనరులను చేజిక్కించుకోవడమే అమెరికా అసలు వ్యూహంగా కనబడుతోంది.

## పెత్తనంలో ఎవరు మొనగాళ్లు?

చరిత్రను పరిశీలిస్తే అమెరికాలోని ఏ పార్టీ అధికారంలో ఉన్నా 'పెద్దన్న' పాత్ర పోషించడంలో వెనకాడలేదు. కానీ వారి పద్ధతులు వేరుగా ఉంటాయి:

**డెమొక్రాట్లు:** క్లింటన్, ఒబామా వంటి డెమొక్రాట్లు 'ప్రజాస్వామ్యం', 'మానవ హక్కుల' పేరుతో ఇతర దేశాల వ్యవహారాల్లో తలదూర్చారు. లిబియా, సిరియా సంక్షోభాల్లో వీరి పాత్ర విస్మరించలేనిది. వీరు ఐక్యరాజ్యసమితి లేదా మిత్రదేశాల కూటములను వాడుకుంటూ 'సాఫ్ట్ పవర్' ముసుగులో పెత్తనం చేస్తారు.

**రిపబ్లికన్లు:** జార్జ్‌బుష్ లేదా ప్రస్తుత డొనాల్డ్ ట్రంప్ వంటి రిపబ్లికన్లు దూకుడుగా వ్యవహరిస్తారు. అంతర్జాతీయ ఒప్పందాలను లెక్కచేయకుండా నేరుగా సైనిక చర్యలకు దిగుతారు. ఇరాక్ దండయాత్ర (బుష్ హయాంలో), ప్రస్తుత మదురో అరెస్ట్ (ట్రంప్ హయాంలో) దీనికి నిదర్శనాలు. ట్రంప్ హయాంలో ఈ వైఖరి మరింత తీవ్రమైంది, ఎందుకంటే ఆయన మిత్రదేశాలను కూడా లెక్కచేయకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారు. గ్రీన్లాండ్ కొనేస్తామని, అవసరమయితే సైనిక చర్య ద్వారా స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ లేదా ఆయన యంత్రాంగం ఇటీవల స్పష్టం చేయడం, కెనడా అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో విలీనం కావాలని అంతకు ముందు ట్రంప్ వ్యాఖ్యానించడం, లేదా మదురోను అదుపులోకి తీసుకోవడం వంటివి ట్రంప్ లేదా రిపబ్లికన్లు అనుసరించే అమెరికా ఫస్ట్ అనే అహంకార ధోరణికి నిదర్శనం. చారిత్రక ఆధారాల ప్రకారం, రిపబ్లికన్ల హయాంలో సైనిక బడ్జెట్ పెరగడం, నేరుగా ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే చర్యలు ఎక్కువగా కనిపిస్తాయి. గణాంకాల ప్రకారం, డెమొక్రాట్ల కంటే రిపబ్లికన్ల హయాంలోనే నేరుగా ఇతర దేశాల ప్రభుత్వాలను మార్చే ప్రయత్నాలు ఎక్కువగా జరిగాయి. తాజాగా ఇరాన్ నిరసనలకు ఆజ్యం పోయడం మరో ఉదాహరణ. ట్రంప్ తనను తాను శాంతికాముకుడిగా అభివర్ణించుకుంటూ, ఎన్నో యుద్ధాలను ఆపానని ప్రకటించుకుంటూ నోబెల్ శాంతి బహుమతికి తనకన్నా అర్హుడు ఎవరూ ఉండరు అని పలుమార్లు అనడం తెలిసిందే. ఆయన మాటలకు, ఆయన అనుసరిస్తున్న దుందుడుకు చర్యలకు పొంతనే లేదు. మళ్లీ సుంకాలు విధిస్తానని, భారత ప్రధాని మోదీపై తాను సంతృప్తిగాలేనని ఆయనకు తెలుసునంటూ ట్రంప్ తాజాగా ప్రకటించడం ఇతర దేశాలపై ఆయనకు ఎంత చిన్నచూపు ఉందో తేటతెల్లం చేస్తోంది. అయితే, ప్రధాని మోదీ నాయకత్వంలోని భారత్ వైఖరి చాలా దృఢంగానే ఉంది. అమెరికా పెత్తనానికి లొంగడంలేదు. మన దేశ ప్రజల ప్రయోజనాలే మిన్నగా విధానాల రూపకల్పన జరుగుతోంది.

అయితే, వ్యూహాత్మకంగా అమెరికా పట్ల జాగరూకత అవసరం అని తాజా పరిణామాలు, చరిత్రలో పాశ్చాత్య దేశాల వైఖరి స్పష్టం చేస్తున్నాయి. విదేశీ దండయాత్రలు, వలస పాలనలు దేశాల ఆర్థిక వెన్నెముకను విరిచేస్తాయి. ఆసియా ఇప్పుడు ప్రపంచ ఆర్థికవ్యవస్థకు చోదక శక్తిగా మారుతోంది. ఈ క్రమంలో భారత్ వంటి దేశాలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. కేవలం ప్రస్తుత అవసరాలకోసమే కాకుండా, రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సైనిక, సాంకేతిక రంగాలలో స్వయం సమృద్ధి సాధించాలి. అమెరికాతో స్నేహం చేస్తున్నప్పటికీ, మన జాతీయ ప్రయోజనాల విషయంలో రాజీ పడకూడదు. పొరుగుదేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల్లో అలజడులు రేగినప్పుడు, వాటిని చల్లార్చడంలో భారత్ ఒక బాధ్యతాయుతమైన శక్తిగా వ్యవహరించాలి. లేదంటే ఆ ఖాళీని అమెరికా వంటి శక్తులు పూరించి మన ముంగిట ముప్పును తెచ్చిపెడతాయి. మొత్తంమీద భారత్ వివిధ కూటముల్లో ప్రాబల్యం పెంచుకుంటూ సాఫ్ట్ పవర్ పెంచుకోవడంతోపాటు, సైనిక, సాంకేతిక రంగాల్లో అత్యంత బలోపేతం కావడం అనే ద్విముఖ వ్యూహాన్ని అనుసరించాలి. 21వ శతాబ్దంలో కూడా ఒక దేశం ప్రపంచం మొత్తాన్ని తన గుప్పిట్లో ఉంచుకోవాలనుకోవడం నాగరికతకే గొడ్డలి పెట్టు. శాంతి అనేది మాటల్లో కాదు, చేతల్లో ఉండాలి. అమెరికా తన అంతర్గత సమస్యలైన తుపాకీ సంస్కృతి, డ్రగ్స్ సమస్యలను వదిలి, ప్రపంచ దేశాలకు 'నీతులు' చెప్పడం ఆపాలి. భారత్ వంటి ఎదుగుతున్న శక్తులు తమ రక్షణ కవచాన్ని పటిష్ఠం చేసుకుంటూనే, ఏకధృవ ప్రపంచం నుండి బహుళ ధృవ ప్రపంచం వైపు అడుగులు వేయాలి. అప్పుడే చరిత్రలో మనం కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందగలం.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్




## సహకార సంఘాల

# సిబ్బంది రిలే దీక్షలు

ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఇకనైనా ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ, రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బంది యూనియన్ జేఏసీ ఇచ్చిన పిలుపుతో నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఆ సహకార సంఘాల శాఖల ఎదుట సిబ్బంది ఈనెల 6న రిలే నిరాహార దీక్షలు చేశారు. గూడూరులో జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామానాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో పలు సహకార సంఘాల సిబ్బంది పాల్గొని మద్దతు ప్రకటించారు. ఉద్యోగుల ఉద్యోగవిరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, తమకు రావాల్సిన వేతనాలను వెంటనే ఇప్పించాలని, 2019 తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారిని రెగ్యులర్ చేయాలని తదితర డిమాండ్లతో వారు ఈ ఆందోళన చేశారు. ఆ సంఘం జిల్లా నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి మల్లికార్జునగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కోటలో ఆందోళనలు

సహకార సంఘాల వారు చేస్తున్న ఆందోళనలో భాగంగా మండల కేంద్రమైన కోటలో ఈనెల 6న సహకార బ్యాంకుల ఉద్యోగులు కూడా రిలే దీక్షలు చేపట్టారు. జీఓ నం. 36ని వెంటనే అమలు చేయాలని, సొసైటీల ఉద్యోగులకు ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని, 2019 నుంచి 2024వరకు ఉన్న పిఆర్‌సి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కోట సమీపంలోని నెల్లూరు కొత్తపాళెం, ఊసుగుంటపాళెం, చిట్టేడు, తిన్నెలపూడి, సిద్ధవరం సహకార సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు తీర్చాలని..జేసీకి విజ్ఞప్తి

జిల్లాలోని రైతుల సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా సాగునీటి ఇబ్బందులు తీర్చాలని భారతీయ కిసాన్ సంఘం జిల్లా నాయకులు ఈనెల 6న జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లును కలసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు వారు ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోని రైతులకు చెల్లించాల్సిన భూ పరిహారం, చెరువులు–కాలువల నిర్వహణ, కనీస మద్దతు ధర కల్పించడం వంటి విషయాలను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ జాయింట్ కలెక్టర్‌కి వారు వినతిపత్రం సమర్పించారు.

## చేనేతకారుల సమస్యలపై దృష్టిపెట్టండి

నెల్లూరుజిల్లాలోని చేనేతకారుల సమస్యలపై రాష్ట్ర చేనేత సంఘాల జేఏసీ దృష్టి సారించాలని, నేతన్నల కష్టాలు తీర్చేందుకు కృషిచేయాలని జిల్లా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బుధవారపు బాలాజీ కోరారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఆ సంఘం రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని జిల్లా సమస్యలను రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా చేనేతలు వరుస తుఫాన్లతో బాగా నష్టపోయారని, అయినా బాధితులకు పూర్తిసాయం అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరులోని ఆప్కో స్థలాన్ని ఇతర సంస్థలకు కేటాయించకుండా చేనేతకారులకే దక్కేలా నేతలు కృషిచేయాలని కోరారు.

## దోమలను నివారించండంటూ వినతి

కావలి పట్టణంలో దోమలు ప్రబలిపోతున్నాయని, వాటిని నియంత్రించేందుకు మునిసిపాలిటీ అధికారులు కృషి చేయాలని సీపీఎం నేతలు పసుపులేటి పెంచలయ్య తదితరులు ఈనెల 5న కావలి మునిసిపల్ మేనేజర్‌కి వినతిపత్రం సమర్పించారు. దోమలతో వ్యాధులు వస్తున్నాయని, అవి కుట్టినచోట దద్దుర్లు వస్తున్నాయని, అధికారులు స్పందించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని, వెంటనే దోమల నిర్మూలనకి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.కృష్ణయ్య, వై.కృష్ణమోహన్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో గూగుల్ డేటా సెంటర్

(మొదటిపేజీ తరువాయి)

విశ్వసనీయత, గతంలో విద్యుత్ కొనుగోలు, సరఫరాకు సంబంధించి జరిగిన ఒప్పందాల్లో జగన్ ప్రభుత్వానికి ముడుపులు ఇచ్చిన వ్యవహారం తదితర అంశాలను బేరీజు వేసుకున్న తర్వాతే విశాఖ డేటాసెంటర్ విషయంలో ముందుకెళ్లాలని యూఎస్ ప్రభుత్వ పెద్దలు గూగుల్ సంస్థకు సూచించినట్లు తెలిసింది. దీంతో ఆ సంస్థ విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుపై పునరాలోచన చేస్తున్నట్లు, ఈ విషయానికి సంబంధించి మరింత క్లారిటీ తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ అనుమానాలను నివృత్తి చేసేందుకే లోకేష్ ఆగమేఘాలపై అమెరికా పర్యటన పేరుతో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌ని కలిసి వివరణ ఇచ్చారని కూడా తెలిసింది. ఇదే నిజమైతే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటులో మరికొంత కాలం జాప్యం జరిగే అవకాశం ఉందని, ఇందులో సహ భాగస్వాములుగా ఉన్న సింగపూర్ ప్రభుత్వం, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు కూడా మరిన్ని జాగ్రత్తలు తీసుకుని ఆ తర్వాతే ముందుకెళ్లే అవకాశం కనిపిస్తోందన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం ప్రస్తుతం త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నట్లే కనిపిస్తోందన్న చర్చ జోరందుకుంది.

## అసలు డేటా సెంటర్ అంటే ఏమిటి..?

గూగుల్‌లోకి వెళ్లి మనం ఏ వెబ్‌సైట్ తెరిచినా, ఏ వీడియో ఓపెన్ చేసినా, ఏ యాప్‌పై క్లిక్ చేసినా డేటా సెంటర్లకే ఆ అభ్యర్థన వెళ్తుంది. సదరు రిక్వెస్ట్‌ని హైస్పీడ్‌లో ప్రాసెస్ చేసి మనకు కావాల్సిన విషయం ఓపెన్ అయ్యేందుకు డేటా సెంటర్ ఉపయోగపడుతుంది. అంటే రోజులోని 24గంటల్లో ప్రతిచోటా, ప్రతి సెకెనూ ఏదో ఒక డేటా సెంటర్ వినియోగదారుల సేవల కోసం పనిచేస్తూనే ఉంటుంది. ఇక మాతృదేశం అమెరికా తర్వాత దాదాపు 1.3 బిలియన్ డాలర్ల వ్యయంతో 2026-2030 మధ్యకాలంలో 1 గిగావాట్ సామర్థ్యం ఉన్న హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని గూగుల్ నిర్ణయించింది. ఇందులో ప్రధానంగా ఆప్టికల్ ఫైబర్‌తో తయారుచేసిన అండర్ సీ కేబుల్స్ (సముద్రగర్భంలో ఏర్పాటు చేసే కేబుల్స్) ద్వారా ఇంటర్‌నెట్‌ను ఆస్ట్రేలియాతో పాటూ సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్ తదితర 12 తూర్పుఆసియా దేశాలకు అందించేలా డిజైన్ చేయనున్నారు. ఇందుకోసం ఐదేళ్ల కాల వ్యవధిని ఎంచుకున్నారు. కాగా గతంలో మనదేశానికి చెందిన అదానీ సంస్థ సింగపూర్ ప్రభుత్వంతో కలిసి 300 మెగావాట్ల సామర్థ్యం ఉండే డేటా సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. దీన్ని మరింత విస్తృతం చేసి 1000 మెగావాట్లు (ఒక గిగావాట్) సామర్థ్యంతో అందించాలని గూగుల్ నిర్ణయించింది. సహభాగస్వాములుగా అదానీ గ్రూప్, ఎయిర్‌టెల్ సంస్థలు, సింగపూర్ ప్రభుత్వం వ్యవహరిస్తాయి. ఈనేపథ్యంలో విశాఖ ఏఐ డేటా సెంటర్ ద్వారా హైస్పీడ్ డేటా ప్రాసెసింగ్, క్లౌడ్ స్టోరేజ్, ఏఐ మోడల్ ట్రైనింగ్, రీసెర్చ్, ఇన్‌ఫ్రాస్టక్చర్ ఏర్పాటుకు సంబంధించిన సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్లోబెల్ డేటా ట్రాఫిక్‌కు సంబంధించిన ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్స్‌కి కూడా విశాఖ డేటా సెంటరే కేంద్రస్థానం కానుంది.

## విశాఖలోనే ఎందుకు..?


బెంగళూరు, చెన్నైతో పోలిస్తే భారత దేశంతో తూర్పు ఆసియా దేశాలకు సంబంధించిన కనెక్టవిటీ విశాఖకు మెరుగ్గా ఉంది. అలాగే అండర్ కేబుల్స్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన సమతుల్యమైన సముద్రగర్భం విశాఖలోనే అనువుగా ఉంది. ఇక చెన్నై, బెంగళూరు వంటి నగరాలున్న తమిళనాడు, కర్నాటక ప్రభుత్వాలతో పోల్చుకుంటే ఏపీ ప్రభుత్వం గూగుల్ సంస్థకి ఇచ్చే అదనపు రాయితీలు ఎక్కువ. వీటి విలువ ఐదేళ్లకాలంలో రూ.22 వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీంతో విశాఖలోనే డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని గూగుల్ సంస్థ నిర్ణయించింది. ఈమేరకు గత ఏడాది అక్టోబర్ 14వ తేదీన గూగుల్ క్లౌడ్ విభాగం సీఈఓ థమస్ కురియన్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమక్షంలో ఆంధ్ర ప్రభుత్వం ఎంఓయూ చేసుకుంది. కాగా ఈ డేటా సెంటర్ ఏర్పాటులో సహ భాగస్వాములుగా వ్యవహరించే అదానీ గ్రూప్ ఎడ్జ్ కనెక్ట్ అనే సంస్థతో కలిసి కంప్లీట్ కోడింగ్ సిస్టమ్‌ను డెవలప్ చేయనుంది. అలాగే డేటా సెంటర్‌కు అవసరమయ్యే పవర్‌సప్లయ్, బ్యాక్‌అప్ జనరేషన్, బ్యాటరీ కూలింగ్ ప్లాంట్స్, సెక్యూరిటీ, సేఫ్టీ సిస్టమ్స్ వంటివి అందించనుంది. ఇక ఎయిర్ టెల్ సంస్థ ఏఐ డేటా సెంటర్‌లోని నెట్‌వర్క్ బ్యాక్‌అప్, ఫైబర్ కేబుల్స్ అంశాలను పర్యవేక్షించనుంది. ఇంతవరకు బాగానే ఉన్నా గతంలో అదానీ గ్రూప్ సంస్థలకు సంబంధించి వచ్చిన ఆరోపణలు, సౌర విద్యుత్ కొనుగోలుకు సంబంధించి జగన్ ప్రభుత్వంలోని పెద్దలకు ముడుపులు ఇవ్వజూపారనే వ్యవహారం, ఆ సంస్థ షేర్లకు సంబంధించి భారత స్టాక్‌మార్కెట్ వర్గాల్లో వచ్చిన విమర్శలను పరిగణనలోకి తీసుకుని ఓవర్ సీస్ పెట్టుబడుల విషయంలో జాగ్రత్త వహించాలని అమెరికా ప్రభుత్వం గూగుల్ సంస్థకు సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో గూగుల్ సంస్థ విశాఖలో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి మరింత క్లారిఫికేషన్‌తో, పూర్తి పారదర్శక విధానాలతో ముందుకెళ్లాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ కారణంగానే డేటా సెంటర్ ఏర్పాటులో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో గూగుల్ చేజారిపోకుండా చూసుకునేందుకు, డేటా సెంటర్ పనులు వేగం పుంజుకునేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించిందని, ఇందులో భాగంగానే గూగుల్ సంస్థ లేవనెత్తిన అనుమానాలను నివృత్తి చేసేందుకు, డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి అనుమతులనైనా వెనువెంటనే ఇప్పించేందుకు లోకేష్ జాగ్రత్తలు తీసుకుంటున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ విషయంలో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌ను స్వయంగా కలిసి వివరణ ఇచ్చేందుకే లోకేష్ ఇటీవల ఆకస్మికంగా అమెరికా పర్యటనకు వెళ్లినట్లు ప్రచారం సాగుతోంది. ఏదేమైనా విశాఖ గూగుల్ డేటా సెంటర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకం కావడం, దీనికి సంబంధించిన క్రెడిట్ దక్కించుకునేందుకు ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ కూడా ప్రణాళికలు రచిస్తుండడంతో డేటా సెంటర్ వ్యవహారం రోజురోజుకూ హాట్ టాపిక్‌గా మారుతోంది. ఇలా ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించి అన్ని కోణాల్లో ప్రాధాన్యత దక్కించుకున్న ఈ డేటా సెంటర్‌కు అడ్డంకులు తొలగి పునాదిరాయి ఎప్పుడు పడుతుందో..? విశాఖ ఏఐ హబ్‌గా మారడానికి ఇంకెంతకాలం వేచి ఉండాలో తెలియాలంటే మరికొంత కాలం వేచి ఉండాల్సిందే అన్నది విశ్లేషకుల అభిప్రాయం. మొత్తం మీద గూగుల్ సెంటర్ సమస్యల వలయంలో వుందన్నది మాత్రం స్పష్టమవుతోంది. అవాంతరాలు, అడ్డంకులు అన్నీ తొలగించుకుని సాధ్యమైనంత త్వరలో శంఖుస్థాపన జరుపుకుంటుందన్న ఆశాభావం టీడీపీ శ్రేణులనుండి వ్యక్తమవుతోంది..!

# కక్ష సాధింపులకు పాల్పడితే సహించం

## • వైకాపా నేత రామ్‌కుమార్‌రెడ్డి



వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ శ్రేణులపై కూటమి ప్రభుత్వం లేనిపోని కేసులు బనాయిస్తోందని, తమ పార్టీ కార్యకర్తలు..నాయకులపై కక్ష సాధింపు చర్యలు చేపడితే సహించేది లేదని వెంకటగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల ఆయన వెంకటగిరిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, తమ కార్యకర్తలకు ఎల్లవేళలా తాము అందుబాటులో ఉంటూ, అండగా నిలుస్తామన్నారు. 2027లో జమిలి ఎన్నికలు వచ్చేది తథ్యమని, నాలుగు నెలల్లో పార్లమెంట్‌లో ఆ బిల్లు ఆమోదం పొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో పారదర్శకత లోపించిందని ఆయన అన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ వెంకటగిరి నియోజకవర్గం అభివృద్ధికి చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో వెంకటగిరి అభివృద్ధికి మేనిఫెస్టో విడుదల చేసిన టీడీపీ ఎమ్మెల్యే రామకృష్ణ రెండేళ్లు కావస్తున్నా, ఒక్క హామీని నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. గూడూరు నియోజకవర్గాన్ని సగం సగం చేయడం ఏమిటని, వెంకటగిరిలో రెవిన్యూ డివిజన్ ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారని ఆయన ప్రశ్నించారు.

### జిల్లాలో కోడి పందాలు - ఎడ్ల పందాలు జరగకుండా

# ముందస్తు చర్యలు తీసుకోండి!

## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం



అవగాహనా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, మున్సిపల్ కమిషనర్ నందన్, పశు సంవర్ధక శాఖ మరియు పోలీసు శాఖ అధికారులు

నెల్లూరు జిల్లాలో కోడిపందాలు, ఎడ్ల పందాలు లాంటివి జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరు క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లా జంతు హింస నివారణ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో జంతువులను హింసకు గురిచేసే విధంగా ఏ విధమైన పోటీలు నిర్వహించినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థాయి, మండలస్థాయి, డివిజనల్ స్థాయిలో రెవెన్యూ, పోలీసులతో బృందాలను ఏర్పాటుచేసి జాయింట్‌గా తనిఖీలు నిర్వహించాలన్నారు. కోడి పందాలు నిర్వహించే ప్రదేశాలను ముందుగా గుర్తించి అడ్డుకోవాలన్నారు. ఎవరైనా కోడిపందాలను ప్రోత్సహించినా, నిర్వహించినా గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయాలని ఏఎస్పీకి సూచించారు. అనంతరం కోడిపందాలు అరికట్టేందుకు అవగాహన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ నాయక్, ఏఎస్పీ సిహెచ్ సౌజన్య, డిఆర్ఓ విజయ్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ నందన్, జడ్పీ సిఇవో శ్రీధర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వసుమతి, ఐఅండ్‌పిఆర్ డీడీ వేణు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఔటర్ రింగ్‌రోడ్డుకు..తొలి అడుగులు

## • 1930 కోట్లతో 83.46 కిలోమీటర్ల రహదారికి సన్నాహాలు

నెల్లూరుజిల్లాలో ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. లేబూరు-బిట్-2 నుండి ప్రారంభమై రాజుపాలెం జంక్షన్ వరకు సుమారు 83.64 కి.మీ. మేర నిర్మించ తలపట్టిన ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణంలో నేషనల్ హై వేస్(జాతీయ రహదారులు), ట్రాఫిక్ పోలీస్, రోడ్లు భవనాలు, ఇరిగేషన్ మరియు సంబంధిత శాఖలు సమన్వయంతో కూలంకుషంగా చర్చించుకొని ఔటర్ రింగ్‌రోడ్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఈనెల 7న ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటుపై తొలి సమీక్ష సమావేశం నిర్వహించారు.

**నాలుగు నియోజకవర్గాల్లో రోడ్డు నిర్మాణం :**

కలెక్టర్ మాట్లాడుతూ, నాలుగు నియోజకవర్గాల్లో ఈ ఔటర్ రింగ్‌రోడ్డు ఏర్పడుతుందన్నారు. కోవూరు నియోజికవర్గంలో 41.44 కిలోమీటర్లు, సర్వేపల్లి నియోజికవర్గంలో 20.94, నెల్లూరురూరల్ నియోజకవర్గంలో 19.64, మరియు ఆత్మకూరు నియోజకవర్గంలో 1.02 కిలోమీటర్ల వంతున, మొత్తంగా 83.64 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. అందుకు సుమారు 1930కోట్ల రూపాయలు వ్యయమవుతాయని ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సంబంధిత శాఖల వారు చర్చించి తుది నివేదిక రూపొందించాలన్నారు. నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులతో వివరంగా ఈ అంశాలను చర్చించాలన్నారు. సమగ్ర నివేదిక అనంతరం అవసరమైన నిధులకై ప్రభుత్వాలకు నివేదించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నగర ఇంచార్జ్ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, రెవిన్యూ డివిజినల్ అధికారి అనూషా, నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ యం.కే.చౌదరి, డీపీఓ వసుమతి, డి.యఫ్.ఓ, ట్రాఫిక్ సిఐలు, రెవిన్యూ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రామ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు

వైఎస్ఆర్సీపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈనెల 8న వెంకటగిరిలో వైఎస్ఆర్సీపి నాయకులు, కార్యకర్తలు, నేదురుమల్లి అభిమానుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు. అనంతరం స్థానిక త్రిభువని సెంటర్‌లోని నేదురుమల్లి జనార్ధనరెడ్డి విగ్రహం వద్ద అన్నదానం నిర్వహించారు.




బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న వెంకటగిరి వైకాపా నాయకులు, కార్యకర్తలు

# అవ్వారు 'నానీల వాన' కాదు.. పుష్పాభిషేకమే!

అవ్వారు శ్రీధర్‌బాబు నెల్లూరులో లబ్ధప్రతిష్టుడైన కవి, రచయిత. అంతేకాక పెన్నా రచయితల సంఘం, అరసం, జాషువా కవితాపీఠం లాంటి సంస్థలకు ఆక్సిజన్. అందర్నీ అక్కున చేర్చుకునే సహృదయతా పతాక ఆయన.

హైకూలు, నానీలు, రెక్కలు, జిప్సీలు, ట్రుమ్రీలు, మామీలు, శైలీలు... ఇలా నాలుగైదు లైన్లలో సాంద్రత గల్గిన భావాల్ని పదునైన వాక్యాలతో అందించే ప్రక్రియలు వెల్లివిరిసాయి. వీటిల్లో ఎన్.గోపి ప్రారంభించిన నానీలు ప్రక్రియ క్లుప్తత, ఆప్తత, కవితాత్మకత, సామాజికతల ప్రాయోజితంగా కలగలిసిన నానీలు 570 సంపుటాలుగా వెలువడ్డాయి. శ్రీధర్ బాబు రెండవ నానీల సంపుటి 'నానీల వాన'. ఎనిమిదిపైగా వివిధ రకాల సంపుటాలు వెలువరించిన సాహితీవేత్త ఆయన.






రచయిత:
**అవ్వారు శ్రీధర్‌బాబు**
సెల్: 85001 30770
వెల: రూ. 100/- పేజీలు: 64
ప్రతులకు: అవ్వారు శ్రీధర్‌బాబు
పెండెంవారి వీధి, ఫత్తేఖాన్‌పేట,
నెల్లూరు. సెల్. 9441784510

ఈ నానీ కవితా సంపుటిలో అనేక అంశాల్ని విభిన్నంగా స్పృశించి తనదైన రీతిలో పాఠకుల్ని ఆశ్చర్యచకితుల్ని చేసిన కవి అవ్వారు శ్రీధర్‌బాబు. నానీల పేరుతో అద్భుతమైన సాహిత్యాన్ని అందించిన శ్రీధర్ అభినందనీయుడు.

పుట్టుకే జననం అంటే ఎట్లా..? కొందరి మనసుల్లోనైనా నీవు చోటు చేసుకోవాలిగా అనే అర్థాన్ని కొందరి మనసుల్లోనైనా నీవు పుట్టాలి అనడం అర్థవంతమైన నానీ ప్రయోగం. ఇది మానవీయ నానీగా చెప్పవచ్చు. మనిషిని ప్రేమించు, మనిషిలో చోటుచేసుకో.. అని కవి బాధాతప్త హృదయంతో శెలవిస్తారు.

సమాజంలో అస్పృశ్యత దురాలోచన వారి పట్ల ఉండాలని సరికొత్త ప్రయోగాన్ని చేశారు శ్రీధర్. అస్పృశ్యత సమంజసమే / దురాలోచనలు నిండిన వారిపట్ల అనడంలో వైవిధ్యం చోటుచేసుకొంది. అస్పృశ్యత కులానిదీ కాదు, గుణానిదని చక్కగా చెప్పారాయన.

స్వాతంత్ర్యం సంపాదించడానికేనా / నిలపడానికీ చెయ్యాలి పోరాటం అనే నానీ వ్యంగార్థంతో సాగింది. ఆనాటి తెల్లదొరల నుంచి స్వాతంత్ర్యం సంపాదించుకోవడానికి పోరాటం సాగిస్తే.. ఈనాడు నల్లదొరల పాలనలో కోల్పోయిన స్వాతంత్ర్యాలకై రణతంత్రంతో పోరాడమని సందేశాన్నిస్తున్నాడు కవి.

"పసివాళ్ళకేం తెలీదా/మొహంలో కాంతి చూడు అమ్మ తన దగ్గర ఉందని' అంటారు కవి శ్రీధర్. ఎంత గొప్ప మాట. అమ్మను అక్కున జేర్చుకొని తానే అధిపతిగా నవ్వుల్లో మునిగే చందమామలా వెలిగే పసివాళ్ళతో పోలిక తెచ్చి వాళ్ళకు అమ్మే లోకం అని తెలుసుగా అని గడుసుగా చెప్తాడు శ్రీధర్.

మరో నానీలో 'ధరలు కళ్లెం విడిచిన గుర్రాలైనాయి / బీద రౌతు ఎన్ని పాట్లు పడాలో అంటాడు శ్రీధర్. ధరల్ని కళ్ళెం విరచిన గుర్రాలనడం ఒక వైచిత్రి. అందుకే చక్కగా బీద రౌతు ఎన్ని పాట్లు పడతాడో అన్నారు. ధరల్ని కళ్లెం విడచిన గుర్రాలనడం లోనే లౌక్యం ప్రదర్శన చేశాడు కవి. తాను చెప్పాల్సిన రెండో వాక్యానికి ప్లాను వేసుకుని అలా చెప్పడం కవి సమయంగా చెప్పవచ్చు.

కోర్కెలు తోటలో మొక్కలు / కత్తిరిస్తుంటేనే అందం ఆనందం. కోర్కెల్ని, తోటలో మొక్కల్ని పోల్చుకొని కత్తిరింపుతో అందాన్ని తెచ్చాడు కవి శ్రీధర్. చేయి తిరిగిన కవి కాబట్టి ఇలాంటి పనులు సులభంగా చేసి ఓ నానీని ప్రతిష్ట చేశాడు కవి.

డబ్బులుంటే చాలు జైలు గదులు విల్లాలవుతాయి. కోరిన కోర్కెలు తీర్చే చలివేంద్రలవుతాయి... అంటారు శ్రీధర్ కవి.

పుకారుకి చిరుతపులి వేగం / అడుగులు జోరుగా పడతాయి అంటారు ఒక నానీలో. ఇది అక్షరాలా నిజం. నిజం వేగం తక్కువ. అబద్ధం వేగం ఎక్కువ. సెల్‌పై కూడా ఓ నానీ.. నీవు పట్టుకొన్న సెల్ నిన్నే పట్టిస్తుందని, అది పోలీసు జాగిలం అని చెప్తారు శ్రీధర్.

విద్యా వ్యవస్థపైన, కవి నానీలు, మనిషి నానీలు, రైతు నానీలు, బడి నానీలు, ప్రకృతి నానీలు, మానవత్వం నానీలు, అక్షరం నానీలు, తరువు నానీలు, సేవ నానీలు, బడ్జెట్ నానీలు, భూమి నానీలు, రెడ్‌క్రాస్ నానీలు, రాజకీయ నానీలు, అమ్మ నానీలు... ఇలా వివిధ నానీలతో నానీల ప్రియులకు విందుభోజనం వడ్డించారు.

నానీల వాననే విస్తృతంగా కురిపించిన కవి శ్రీధర్ అభినందనీయులు.



**చిన్ని నారాయణరావు**
94402 02942

# నేను స్వర్గానికి వెళ్ళను



**సత్యవేటి ప్రేమతేజ**
99085 91696

నేను స్వర్గానికి వెళ్ళను
వెళ్ళను గాక వెళ్ళను.
పునర్జన్మంటూ ఒకటి ఉంటే
మళ్ళీ మళ్ళీ ఇక్కడే పుడతాను
గడ్డి పువ్వుగ నైనా
గుడ్డి గువ్వగ నైనా!

నాకు తెలియని
స్వర్గ సుఖాలకన్నా
నే నెరిగిన
ఐహిక బాంధవ్యాలే
ఆత్మీయతలే
నాకెంతో మిన్న!

బడిలేని గుడిలేని
సడీసవ్వడి లేని
నిశ్శబ్దం తాండవించే
ఆ ప్రశాంత పరలోకంలోకి
ప్రవేశించి నేనేంచేయాలని?

అమ్మ చేతి వంటలను
మించిన రుచులుంటాయా అక్కడ?
ప్రాణమిత్రుల కేరింతలను
తలదన్నే సంతోషాలా అక్కడ?
యవ్వనంలో నా పడుచు భార్యను మించిన
అందగత్తెలా ఆ స్వర్గలోకపు కాంతామణులు?

నా జ్ఞాపకాలు
నా మధురస్మృతులు
నా అనుబంధాలు
అన్నీ ఇక్కడ వదిలేసి
నేను స్వర్గానికేగలేను.

అప్పులోళ్ల పలకరింపులు
ఆప్తుల ఆపన్న హస్తాలు
బరువు బాధ్యతలు లేని
ఆ స్వర్గలోకం నాకెందుకు?

రంగురంగుల ప్రకృతి వెలుగులు
శతకోటి జీవులు నా వెన్నంటే ఉండే
ఈ ఇహలోకం కాదని
నిరాకారమైన ఆత్మల మధ్య
కళ్ళు మిరిమిట్లుగొలిపే
ఆ దైవకాంతుల మధ్య
ముమ్మాటికి నేనిమడలేను.

నాలోనే దేవుడున్నప్పుడు
నేనే దేవుణ్ణి కాగలిగినప్పుడు
ఈ భూతలాన్నే స్వర్గం చేస్తా!

అంతేగాని
నేనక్కడికి వెళ్ళను
పదే పదే చెప్తున్నా
ప్రాణమున్న గడ్డిపోచగనైనా
ప్రాణంలేని చిల్లి గవ్వగనైనా
మళ్ళీ మళ్ళీ ఇక్కడే పుడతాను.

'అయితే నరకానికి వెళ్ళు'
అని అనకండి.
నా లోకం తప్ప మరే లోకమూ వద్దు
నేను నడయాడిన ఈ నేలమీదే
నా ఉనికి, నా ఉషస్సు.
నేను ఐహిక వాసిని
నా అస్తిత్వం ఇక్కడే ఉంది.

# అవగాహనతోనే.. రోడ్డు ప్రమాదాల నివారణ

**మంత్రి ఆనం**


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర అధికారులు

రోడ్డు భద్రత విషయాల పట్ల అవగాహన, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలనే ఆలోచన ప్రతిఒక్కరిలో ఉండాలని, అలా ఉన్నప్పుడే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 5న ఆత్మకూరు మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో ఆయన పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించే పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. మనకోసం, మన కుటుంబ సభ్యుల కోసం, మనతోటి వారి ప్రాణాల రక్షణ కోసం ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థిని, విద్యార్థులు చిన్ననాటి నుంచే ట్రాఫిక్ నిబంధనలు పాటించే అలవాటు చేసుకోవాలని మంత్రి ఆనం సూచించారు. ఆర్డీవో పావని, కమిషనర్ గంగాప్రసాద్, రవాణాశాఖ అధికారి రాములు తదితరులు పాల్గొన్నారు.

## బధిర విద్యార్థుల కోసం..

# కలెక్టర్‌కి ఆడియో మీటర్ అందజేత


కలెక్టర్‌కి ఆడియో మీటర్ అందజేస్తున్న యశ్వంత్

బుచ్చిరెడ్డిపాలెం మండలంలో వినికిడి లోపం గల బధిరుల కోసం ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రత్యేక పాఠశాలకు, నరాళ్లారంపేట నివాసి, ప్రస్తుతం అమెరికాలోని ఫ్లోరిడాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న యశ్వంత్ తమ సొంతనిధులు వెచ్చించి 82వేల రూపాయల విలువైన ఆడియో మీటర్‌ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకి ఇటీవల అందించారు. దానిద్వారా బధిర విద్యార్థులకు వినికిడి లోపం శాతం ఎంత ఉందో ఖచ్చితంగా నిర్ధారించవచ్చని, అలాగే ఈ ఉపకరణం విద్యార్థుల విద్యాభివృద్ధికి వారి అభ్యున్నతికి దోహదపడుతుందని పాఠశాల నిర్వాహకులు ఎన్.ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా యశ్వంత్‌ని కలెక్టర్ అభినందించారు.









Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com